RNI No. APTEL/2009/28868

ప్రజల కోసం... ప్రజల పక్షాన...
నిజం మా నడవడి...

సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

PEOPLE ISSUES OUR MISSION

TRUTH BRINGS A BETTER SOCIETY

CITIZEN TIMES TELUGU DAILY

సంపుటి :18 | సంచిక : 343 | సంపాదకులు : కంచర్ల సందీప్ కుమార్ | ప్రచురణ : విశాఖపట్నం | 18-10- 2026 | పేజీలు : 8 | వెల : 2/- రూ ॥

VOLUME: 18 | ISSUE : 343 | EDITOR:KANCHERLA SANDEEP KUMAR | PUBLISHED: VISAKHAPATNAM | 18-10-2026 | PAGES: 8 | PRICE : 2/- RS

బెజవాడలో దసరా సందడి..

మహాలక్ష్మి అలంకారంలో కనకదుర్గ

ఇంద్రకీలాద్రికి భారీగా తరలివస్తున్న భక్తులు



విజయవాడ, సిటిజన్ టైమ్స్

విజయవాడ ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజైన శనివారం కనకదుర్గమ్మ వారు శ్రీ మహాలక్ష్మి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఇంద్రకీలాద్రి జనసంద్రమైంది. తెల్ల వారుజాము నుంచే భక్తులు పోటెత్తడంతో ఆలయ పరిసరాలు, క్యూలై న్లన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రస్తుతం అమ్మవారి దర్శనానికి సుమారు మూడు గంటల సమయం పడుతోంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచు కుని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా

తరువాయి 2లో..

ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

- ఏపీలో పర్యటించిన మధ్యప్రదేశ్ సీఎం మోహన్ యాదవ్
- సీఎం చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ
- మంగళగిరిలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో సమావేశం
- పులుల సంరక్షణ, అడవి దున్నల తరలింపుపై ఇరువురి మధ్య చర్చ
- త్వరలో మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని తెలిపిన పవన్ కల్యాణ్

అమరావతి, సిటిజన్ టైమ్స్

మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి మోహన్ యాదవ్ శనివారం ఆంధ్రప్రదేశ్‌లో పర్యటించారు. విజయ వాడ ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు, విజయ వాడ ఉత్సవ్ 2.0 కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన ఆయన, ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌లతో వేర్వేరుగా సమావేశమయ్యారు. ముందుగా ఉండవల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన మోహన్ యాదవ్, ముఖ్యమంత్రి

తరువాయి 2లో..

రెగ్యులర్ కంటే ప్రత్యేక సర్వీసులే ఎక్కువ

50 శాతం అదనపు ఛార్జీలతో భారంగా ఆర్టీసీ పండగ ప్రయాణం

మంచిర్యాల, గోదావరిఖని మార్గాల్లో సిటీ మెట్రో డీలక్స్ బస్సులు

జేబీఎస్‌లో ప్రయాణికుల రద్దీ

హైదరాబాద్, సిటిజన్ టైమ్స్

బతుకమ్మ, దసరా పండగల రద్దీని ఆర్టీసీ ప్రత్యేక ఆదాయ అవకాశంగా మలుచుకుంటోంది. హైదరాబాద్ నగరంలో తక్కువ దూరాల్లో తిరిగే సిటీ బస్సులను సైతం సుదూర ప్రాంతాలకు మళ్లించి ప్రత్యేక సర్వీసులుగా నడుపుతోంది. రెగ్యులర్ సర్వీసులను స్పెషల్ సర్వీసులుగా మార్చి సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తుండటంతో ప్రయాణికులపై భారం పడుతోంది. మరోవైపు పండగ రద్దీతో సాధారణ బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసులకూ భారీ గిరాకీ ఉంది. హైదరాబాద్ నుంచి వరంగల్, సూర్యాపేట, మిర్యాలగూడ, కరీంనగర్, నిజామాబాద్, ఖమ్మం, సత్తుపల్లి, మహబూబ్‌నగర్,

తరువాయి 2లో..

కూటమి అభ్యర్థులు గెలవాల్సిందే

సీఎం చంద్రబాబు

అమరావతి, సిటిజన్ టైమ్స్

స్థానిక సంస్థల ఎన్నికలపై మంత్రులు, ఎమ్మెల్యేలతో సీఎం చంద్రబాబు టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. సోషల్ రీ ఇంజినీరింగ్ ద్వారా అన్ని వర్గాలకూ సమాన అవకాశాలు

తరువాయి 2లో..

మారిన టోక్యో వ్యూహాలు...

భారత్‌కు మంచి అవకాశం

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

వేగంగా మారుతున్న భౌగోళిక రాజకీయాలు, ట్రంప్ తెంపరితనం, గందరగోళ నిర్ణయాలతో ఎవరినీ నమ్ముకునే పరిస్థితి లేకుండా పోయింది. దీంతో రెండో ప్రపంచ యుద్ధం తర్వాత 'అస్త్రసన్యాసం' చేసిన జపాన్ పూర్తిస్థాయిలో ఆయుధాలు పట్టేందుకు సన్నద్ధమవుతోంది. స్వీయరక్షణ బాధ్యతను సొంత భుజాలపైనే వేసుకుంది. దీంతో జపాన్ కూడా సైనిక శక్తిగా ఎదిగే అవకాశం ఉంది. ఇలాంటి పరిస్థితులను అనుకూలంగా మలచుకుంటే భారత్‌కు ఎంతో మేలు! రెండో ప్రపంచ యుద్ధంలో ఓటమి తర్వాత జపాన్ శాంతికాముక దేశంగా మారింది. యుద్ధవిరమణ ఒప్పందంలో భాగంగా ప్రత్యర్థులు నిర్దేశించిన కట్టుబాట్లకు అనుగుణంగా ఈ పద్ధతిని ఎంచుకుంది. పోరును సార్వభౌమ హక్కుగా పరిగణించే ఆలోచనకు శాశ్వతంగా స్వస్తి పలికింది. అంతర్జాతీయ వివాదాల పరిష్కారం కోసం బలప్రయోగానికి దిగరాదని నిర్ణయించింది. జపాన్ ఎన్నటికీ ప్రబల సైనికశక్తిగా మారబోదంటూ 1977లో ఎలుగెత్తి చాటిన సిద్ధాంతానికి అలాగే కట్టుబడి ఉంది. స్వీయరక్షణ కోసం పరిమిత స్థాయిలోనే సైనికశక్తిని కొనసాగించింది. దాంతో జపాన్ రక్షణ బాధ్యతను ప్రధానంగా అమెరికాయే చూసుకునేది. ఆ శాంతి సిద్ధాంతాన్ని పూర్తిగా వదిలేసినట్లు ఇప్పుడు అధికారికంగా ప్రకటించకున్నా టోక్యో ఆలోచనలు మాత్రం గణనీయంగా

తరువాయి 2లో..

ఎగిరే కారు వచ్చేసింది..

గాల్లోకి దూసుకెళ్లిన టెస్లా రోడ్‌స్టర్!

టెస్లా కొత్త రోడ్‌స్టర్‌తో ఎగిరే కారు తరహా విన్యాసాలు

టెక్సాస్‌లోని స్పేస్ఎక్స్ కేంద్రంలో ప్రదర్శన

న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్

గాలిలో ఎగిరే కార్లను టెస్లా సంస్థ రూపొందించింది. అది విమానాల సాంకేతికతతో గాలిలోకి లేచే వాహనం కాదు. స్పేస్ఎక్స్ రాకెట్ టెక్నాలజీతో రోడ్డుపై దూసుకెళ్లే కారు. సెకను కంటే తక్కువ సమయంలోనే 96.6 కిలోమీటర్ల వేగాన్ని అందుకోవడం దాని ప్రత్యేకత. అంతవేగంలోనూ రోడ్డుపై ఏదైనా వాహనం అడ్డువస్తే బ్రేకులు వేయాల్సిన అవసరంలేదు. మార్షల్ ఆర్ట్స్ వీరుడిలా ఈ కారు గాల్లోకి ఎగిరి మరీ ప్రమాదాన్ని తప్పిస్తుంది. గరిష్ఠంగా గంటకు 370 కిలోమీటర్లకు పైగా వేగంతో దూసుకెళ్లే సామర్థ్యమున్న ఈ వాహనం.. భవిష్యత్తులో ప్రపంచంలోనే అత్యంత

తరువాయి 2లో..

ఏపీని 'సౌత్ బీహార్'గా మారుస్తున్నారు

టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

- టీడీపీ, వైసీపీలది ప్రతీకార రాజకీయమన్న షర్మిల
- స్థానిక ఎన్నికల్లో హింసపై తీవ్ర స్థాయిలో విమర్శలు
- ఎన్నికల సంఘం, పోలీసుల తీరుపై ప్రశ్నలు
- స్వేచ్ఛాయుత ఎన్నికలకు
- చర్యలు తీసుకోవాలని డిమాండ్

అమరావతి, సిటిజన్ టైమ్స్

టీడీపీ, వైసీపీలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ రెండు పార్టీలు దాష్టీక రాజకీయాలు చేస్తూ, ప్రతీకారాలతో రతనాల సీమను రక్తసీమగా మారుస్తున్నాయని ఆరోపించారు. అన్నపూర్ణ లాంటి ఆంధ్రప్రదేశ్‌ను మరో 'సౌత్ బీహార్'గా మార్చే పరిస్థితులు సృష్టిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న హింసాత్మక ఘటనలపై సోషల్ మీడియా వేదికగా ఆమె స్పందించారు. స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా రాయచోటి,

తరువాయి 2లో..

నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...

గెట్ రెడీ!: విజయసాయిరెడ్డి

- ఏపీలో టీడీపీ, వైసీపీ మధ్య సివిల్ వార్ నడుస్తోందన్న విజయసాయిరెడ్డి
- పుంగనూరు, తాడిపత్రి ఘటనలను ప్రస్తావిస్తూ రెండు కుటుంబాలపై ఫైర్
- 'రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప' అంటూ రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలపై ఆందోళన

అమరావతి, సిటిజన్ టైమ్స్

ఆంధ్రప్రదేశ్ రాజకీయాలపై రాజ్యసభ మాజీ సభ్యుడు విజయసాయిరెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో టీడీపీ, వైసీపీల మధ్య పౌర యుద్ధం (సివిల్ వార్) నడుస్తోందని, రెండు కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని ఆరోపిస్తూ సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టారు. గత రెండు రోజులుగా పుంగనూరు, రాయచోటి, తాడిపత్రి, ఆళ్లగడ్డ వంటి పట్టణాల్లో జరుగుతున్న హింసాత్మక ఘటనలను విజయసాయిరెడ్డి తన పోస్టులో ప్రస్తావించారు. "రెడ్ బుక్ వర్సెస్ రప్ప రప్ప రాజకీయం నడుస్తోంది. చంద్రబాబు, జగన్ కుటుంబాల

తరువాయి 2లో..

ఎడిటోరియల్

టీడీపీ నేతలే జనసేన అభ్యర్థులు!

స్థానిక ఎన్నికల్లో కూటమి రాజకీయాలు ఆసక్తి రేపుతున్నాయి. సీట్ల సర్దుబాటు ఒక కొలిక్కి వచ్చిన తర్వాత అభ్యర్థులను పోటీకి నిలిపే విషయంలో చోటుచేసుకున్న రాజకీయం రసవత్తరంగా మారుతోంది. కూటమిలోని ప్రధాన పార్టీ అయిన టీడీపీపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చిన జనసేన, బీజేపీ పార్టీలు తమ కోటాలో వచ్చిన సీట్లలో సరైన అభ్యర్థులను పోటీకి పెట్టే విషయంలో ముల్లాగుల్లాలు పడుతున్నాయన చెబుతున్నారు. 4 మేయర్, 20 మున్సిపాలిటీలకు అభ్యర్థులను నిలిపే విషయంలో జనసేన అనుసరిస్తున్న వైఖరిపై సొంత పార్టీ కార్యకర్తలే అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారని అంటున్నారు. పార్టీలో తొలి నుంచి కొనసాగుతున్న వారి బదులుగా టీడీపీ నుంచి నాయకులను దిగుమతి చేసుకుని వారినే జనసేన అభ్యర్థులుగా పోటీకి పెట్టడంపై సోషల్ మీడియాలో విస్తృత చర్చ జరుగుతోంది. జనసేన పార్టీ అభ్యర్థులుగా టీడీపీ నేతలే మున్సిపల్ ఎన్నికల బరిలో దిగుతుండటం సోషల్ మీడియాలో హాట్ టాపిక్ అవుతోంది. ఆ మాత్రం దానికి జనసేన వాటా సీట్లు అంటూ ప్రచారం చేసుకోవడం ఎందుకని జనసేన కార్యకర్తలు సోషల్ మీడియాలో చర్చించుకుంటున్నారు. ఇదే సమయంలో టీడీపీ నేతలు కూడా ఈ పరిస్థితి పట్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జనసేన, బీజేపీలకు మున్సిపాలిటీలను ఇచ్చేసిన తర్వాత నాయకులను కూడా పంపాల్సిన పరిస్థితులు ఏర్పడటమే వారిని ఆవేదనకు గురిచేస్తోందని అంటున్నారు. పొత్తుల్లో భాగంగా జనసేన నాలుగు కార్పొరేషన్లలో పోటీ చేస్తుండగా, రెండు కార్పొరేషన్లకు మేయర్ అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ప్రధానమైన విజయవాడ కార్పొరేషన్ అభ్యర్థిగా సీనియర్ నేత వంగవీటి రాధాకృష్ణను ఖరారు చేశారు. రాధాకు మేయర్ సీటు అంటూ చాలా కాలంగా ప్రచారం జరుగుతోంది. పార్టీ కూడా ఆయనను అభ్యర్థిగా ప్రకటించింది. అయితే రాధాకృష్ణ నిన్నమొన్నటి వరకు టీడీపీలోనే ఉన్నారు. ఇప్పుడు కండువా మార్చుకుని జనసేన తరఫున మేయర్ గా పోటీ చేయడంపై కార్యకర్తలు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి రాష్ట్రంలో చాలా చోట్ల ఉందని అంటున్నారు. జనసేనకు కేటాయించిన పలు మున్సిపాలిటీలో చైర్మను అభ్యర్థులుగా టీడీపీ వారే పోటీకి దిగుతున్నారని, పదవి కోసం కండువా మార్చుకుని జనసేన గుర్తుపై పోటీకి సిద్ధమవుతున్నారని అంటున్నారు. తుని మున్సిపల్ సీటు విషయంలో ఇదే జరగ్గా, రామచంద్రాపురంలో కూడా జనసేనలోకి వచ్చి టీడీపీ నేతలు పోటీకి సిద్ధమవడంపై కార్యకర్తలు ముఖంమీదే నిలదీస్తున్నారని అంటున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇదే సమయంలో టీడీపీలో కూడా తీవ్ర ఆగ్రహం వ్యక్తం అవుతోంది. బలం లేకపోయినా జన సేన కొన్ని మున్సిపాలిటీలను తీసుకుందని, అక్కడ సరైన అభ్యర్థులు లేక తెల్ల ముఖం వేస్తోందని టీడీపీ కార్యకర్తలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీంతో టీడీపీ కార్యకర్తలకు నచ్చజెప్పడం మంత్రులు, ఎమ్మెల్యేలకు భారం అవుతూందని అంటున్నారు. మన్యం జిల్లాలోని సాలూరు మున్సిపాలిటీని జనసేనకు కేటాయించగా, అక్కడ సరైన అభ్యర్థే లేరని, 2 శాతం ఓటింగుతో జనసేన ఎవరిని నిలబెడుతుందని టీడీపీ నాయకులు నిలదీస్తున్నారు. ఇదే సమయంలో కార్యకర్తల బాధను చూడలేక మంత్రి సంధ్యారాణి కన్నీరు పెట్టుకున్నారు. ఇక విజయనగరం జిల్లాలోనూ ఇటువంటి పరిస్థితే నెలకొంది. ఈ నియోజకవర్గంలో రాజాం, నెల్లిమర్ల నగర పంచాయతీలను జనసేనకు కేటాయించారు. అయితే రాజాంలో జనసేనకు సరైన నాయకులు లేరని, అవసరమైతే ఆ పార్టీలోకి టీడీపీ నాయకులే వెళ్లి పోటీ చేయాల్సివుంటుందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చేసిన వ్యాఖ్యలు వైరల్ అవుతున్నాయి. ఈ పరిణామాలు గమనిస్తుంటే పొత్తుల్లో భాగంగా సీట్లు తీసుకున్న జనసేన, అక్కడ సరైన అభ్యర్థులు ఉన్నారా? లేరా? అన్నది ముందుగా పరిశీలించలేదని అంటున్నారు. దీనివల్ల టీడీపీ నాయకులే కండువాలు మార్చుకుని జనసేన తరఫున పోటీకి దిగాల్సిన పరిస్థితులు నెలకున్నాయని అంటున్నారు. దీనిపై రెండు పార్టీల్లోనూ అసంతృప్తులు, నిరసన స్వరాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు. అయినప్పటికీ విజయం కోసం అంతా కలిసి పనిచేస్తామని పైకి చెబుతున్నారని, అయితే ఎన్నికల్లో ప్రజలు మాత్రం ఏ విధంగా స్పందిస్తారో చూడాల్సివుందని అంటున్నారు. మొత్తానికి తాజా ఎన్నికలు మరోసారి నేతల సర్దుబాటుపై హాట్ టాపిక్ అవుతున్నాయి.

‘స్పెషల్’ బాదుడు!

నారాయణఖేడ్, ఆదిలాబాద్ తదితర ప్రాంతాలకు ప్రయాణికులు భారీగా తరలివెళ్తున్నారు. ఆదివారం సద్దుల బతుకమ్మ పండగ ఉండటంతో హైదరాబాద్, ఇతర నగరాలు, పట్టణాల నుంచి గ్రామీణ ప్రాంతాలకు శుక్రవారం భారీగా పయనం అయ్యారు. శనివారం రద్దీ భారీగా ఉండనుంది.

సిటీ బస్సులు.. సుదూర ప్రయాణాలు

హైదరాబాద్‌లో తక్కువ దూరాలు తిరిగేందుకు అనువుగా ఉండే మెట్రో డీలక్స్ బస్సులను సైతం పండగ ప్రత్యేక సర్వీసులుగా వినియోగిస్తున్నారు. అదీ అదనంగా 50 శాతం ఛార్జీలతో జేబీఎస్ నుంచి మంచిర్యాల, గోదావరిఖని వంటి ప్రాంతాలకు ఈ బస్సులను నడుపుతున్నారు. జేబీఎస్–మంచిర్యాలకు 91266 నంబరుతో ప్రత్యేక సర్వీసుగా నడిపారు. హైదరాబాద్ నుంచి గోదావరిఖనికి 91287, 91255 నంబర్లతో మెట్రో డీలక్స్ బస్సులను నడిపారు.

మంచిర్యాల మార్గంలోనూ..: జేబీఎస్ నుంచి మంచిర్యాలకు శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు 31 బస్సులు వెళ్లగా అందులో 26 అదనంగా 50 శాతం ఛార్జీలుండే ప్రత్యేక బస్సులే. అక్టోబరు 17న మొత్తం 56 సర్వీసుల్లో 37 ప్రత్యేక సర్వీసులే. అంటే మొత్తం సర్వీసుల్లో సగానికిపైగా బస్సుల్లో ప్రయాణికులు అధిక ఛార్జీలతో సొంతూళ్లకు చేరాల్సిన పరిస్థితి నెలకొంది.

కరీంనగర్‌కు భారీ డిమాండ్: హైదరాబాద్ నుంచి కరీంనగర్‌కు రద్దీ భారీగా ఉంది. సాధారణ బస్సులతోపాటు ప్రత్యేక సర్వీసుల్లోనూ 80 శాతానికిపైగా రిజర్వేషన్ టికెట్లు అయిపోయాయి.

సత్తుపల్లి వైపు సగానికిపైగా

హైదరాబాద్ నుంచి సత్తుపల్లికి శుక్రవారం సాయంత్రం నుంచి రాత్రివరకు నడిచిన 30 బస్సుల్లో 20 ప్రత్యేక సర్వీసులే ఉన్నాయి. 17న మొత్తం 38 సర్వీసులు నడపాలని నిర్ణయించగా..అందులో 24 ప్రత్యేక బస్సులే. హైదరాబాద్–ఖమ్మం మార్గంలోనూ ప్రయాణికుల రద్దీ ఎక్కువుంది. 16న సాయంత్రం నుంచి రాత్రివరకు 44 బస్సులు నడిస్తే వాటిలో 24 ప్రత్యేక సర్వీసులే. 17న నడిపే 134 బస్సుల్లో 55 ప్రత్యేక సర్వీసులున్నాయి. వరంగల్ మార్గంలో రద్దీ అధికంగా ఉంది.

జపాన్... ఆయుధం పడుతోంది!

మారుతున్నాయి.

మారిన టోక్యో వ్యూహాలు...

జపాన్ గత కొన్నేళ్లుగా గణనీయ స్థాయిలో సైనిక మార్పులను చేపడుతోంది. ఈ ఏడాది తన రక్షణ బడ్జెట్‌ను జీడీపీలో 2 శాతానికి పెంచింది. ఈ వ్యయాన్ని ఒకే ఒక్క శాతంగా నిర్దేశిస్తూ 1976లో విధించిన నిబంధనను తొలగించింది. ప్రతిదాడి సామర్థ్యాలనూ పెంచుకుంటోంది. వెయ్యి కిలోమీటర్ల పరిధి కలిగిన హైపర్‌సోనిక్ గ్లైడ్ ఆయుధాలు, టైప్12 క్రూజ్ క్షిపణులను మోహరించింది. అమెరికా నుంచి 400 తోమహాక్ క్షిపణులనూ కొనుగోలు చేస్తోంది. సమీకృత తీర రక్షణ వ్యవస్థలను నిర్మిస్తోంది. గగనతల, ఉపరితల, జలాంతర డ్రోన్లను ఇందుకు ఉపయోగిస్తోంది. బ్రిటన్, ఇటలీలతో కలిసి ఆరోతరం స్టెల్త్ యుద్ధవిమానాన్ని అభివృద్ధి చేస్తోంది. ఫిలిప్పీన్స్, ఇండోనేసియాతో భద్రతా బంధాన్ని బలోపేతం చేసుకుంటోంది. వాటికి యుద్ధనౌకలను అందిస్తోంది. ఏఐ నియంత్రిత డ్రోన్లపై పెట్టుబడులు పెడుతోంది. తన నౌకాదళంలోని హెలికాప్టర్ వాహక నౌకలను పూర్తిస్థాయి విమాన వాహక నౌకలుగా ఆధునికీకరిస్తోంది. రక్షణ ఎగుమతులపై ఉన్న ఆంక్షల నుంచి సహాయ చర్యలు, రవాణా, నిఘా, హెచ్చరిక, మందుపాతరలను గుర్తించే సాధనాలను జపాన్ మినహాయించింది. భారత్ సహా 17 దేశాలకు వీటిని విక్రయించడానికి నిర్ణయించింది. ఆయుధ ఎగుమతులకు సంబంధించి జపాన్ తీసుకున్న అతిపెద్ద నిర్ణయం ఇదే. శాంతికాముక ముద్ర నుంచి దూరం జరిగే ప్రక్రియకు మునుపటి షింజో అబే ప్రభుత్వంలోనే బీజం పడింది. చైనా సైనికశక్తి నానాటికీ పెరుగుతుండటం, తైవాన్ విషయంలో ఆ దేశం తరచూ దౌర్జన్యానికి దిగడం; ఉత్తరకొరియా, రష్యాల నుంచి పొంచి ఉన్న ప్రమాదాల వంటివి జపాన్ మనసు మారడానికి కారణమయ్యాయి. దశాబ్దాలుగా జపాన్‌కు ప్రధాన రక్షకుడిగా అమెరికా ఉన్నా, అగ్రరాజ్యం మద్దతు ఏకపక్షం కాదని ఉక్రెయిన్ యుద్ధం చాటుతోంది. ఆయుధ సరఫరా కోసం ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేస్తున్నప్పటికీ అమెరికా స్పందన అరకొరగానే ఉంటోంది. దీనికితోడు అగ్రరాజ్యం మద్దతు ఉన్నంతమాత్రాన పూర్తిస్థాయి రక్షణ ఉన్నట్లు కాదని కూడా స్పష్టమవుతోంది. అమెరికా ఆయుధ ఉత్పత్తికీ పరిమితులున్నాయి. అందుకని ఆ దేశం నుంచి అందే సాయంలోనూ పరిమితులు ఉంటాయని జపాన్‌కు బోధపడింది. ఇరాన్ యుద్ధంలో అమెరికా బలహీనతలూ బయటపడ్డాయి. ట్రంప్ విధానాల్లో నిలకడ లోపించడం, అస్తవ్యస్త నిర్ణయాలు వంటివి టోక్యో మనసు మారడానికి కారణమయ్యాయి. పశ్చిమాసియా, ఉక్రెయిన్ యుద్ధాలతో ఆయుధాలకు డిమాండ్ పెరిగింది. అదే సమయంలో అమెరికా ఆయుధ ఉత్పత్తి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఐరోపా సహా అనేక మిత్ర దేశాలు ప్రధానంగా అగ్రరాజ్యం నుంచే అస్త్రశస్త్రాలను కొనుగోలు చేసేవి. ఇప్పుడు భిన్న దేశాలపైకి వాటి దృష్టి మరలింది. అంతర్జాతీయ భౌగోళిక రాజకీయ వ్యవహారాల్లో వస్తున్న పెనుమార్పుల కారణంగా అనేక దేశాలు తమ సైనికశక్తిని ఆధునికీకరిస్తున్నాయి. ఇలాంటి దేశాలు జపాన్‌ను నమ్మకమైన ఆయుధ సరఫరాదారుగా పరిగణించే అవకాశం ఉంది. ఈ ఉద్దేశంతో టోక్యో హైటెక్ అస్త్రశస్త్రాల ఉత్పత్తిపై దృష్టి పెడుతోంది. ఆయుధ సంస్థల్లో పునరుజ్జీవనం నింపాలన్న జపాన్ నిర్ణయం వెనుక ఆర్థిక కారణాలు కూడా ఉన్నాయి. ఆయుధ ఎగుమతులపై ఆంక్షలు తొలగించడం వల్ల జపాన్‌కు చెందిన మిత్సుబిషి, కవాసాకి వంటి దిగ్గజ కంపెనీలు లాభపడే అవకాశం ఉంది.

భారత్‌కు మంచి అవకాశం

భారత్‌తో రక్షణ బంధాన్ని ఏర్పర్చుకోవడానికి జపాన్ ఇటీవల కాలంలో ఆసక్తి చూపుతోంది. క్వాడ్ కూటమిలో చిగురించిన మైత్రి బలోపేతమవుతోంది. తాజా జపాన్ సైనిక పునరుత్థానం భారత్‌కు మంచి అవకాశం. రెండు దేశాల సైన్యాలు ఉమ్మడి విన్యాసాలు నిర్వహిస్తున్నాయి. ఇటీవల ‘వీర్ గార్డియన్–2026’ కార్యక్రమంలో తేజస్ యుద్ధవిమానంలో జపాన్ ఎయిర్ సెల్ఫ్–డిఫెన్స్ ఫోర్స్ అధిపతి జనరల్ తహెహిరో మోరిటా గగనవిహారం చేయడం ద్వైపాక్షిక రక్షణ మైత్రి కొత్త పుంతలు తొక్కుతోందన్న సంకేతాలను ఇచ్చినట్లయింది. భారత్ ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిన తేజస్‌కు అంతర్జాతీయంగా ప్రాముఖ్యత పెరగడానికి కూడా ఇది దోహదపడుతుంది. ఆ విన్యాసాల కోసం జపాన్ తన ప్రధాన యుద్ధవిమానమైన ఎఫ్–2ఏను తొలిసారిగా ఇక్కడికి పంపడం ఇండియాకు టోక్యో కల్పిస్తున్న ప్రాధాన్యానికి నిదర్శనం. సముద్ర భద్రతపైనా భారత్, జపాన్‌లు ఇటీవల ఒప్పందం కుదుర్చుకున్నాయి. భారత యుద్ధనౌకల కోసం యూనిఫైడ్ కాంప్లెక్స్ రేడియో యాంటెన్నాలను ఉమ్మడిగా అభివృద్ధి చేసేందుకూ ఒప్పందం కుదిరింది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో సైన్యాలు సరకులు, సేవలను ఇచ్చిపుచ్చుకోవడానికి ఇరుదేశాలు సమ్మతించాయి. ఈ మైత్రిని మరింత బలోపేతం చేసుకుంటూ జపాన్‌తో కలిసి కొత్తతరం ఆయుధాల రూపకల్పనకు కృషిచేయాలి. ఆ దేశం నుంచి అధునాతన పరిజ్ఞానాన్ని పొందేందుకు ప్రయత్నించాలి. ఆయుధ ఉత్పత్తి హబ్‌గా ఎదగాలన్న భారత లక్ష్యానికి ఇది బాటలు పరుస్తుంది.

ఏపీలో మధ్యప్రదేశ్ సీఎం...

చంద్రబాబు, పవన్‌తో వేర్వేరుగా భేటీ

చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. సీఎం నివాసానికి వచ్చిన ఆయనకు రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికారు. అనంతరం నేతలు కాసేపు ముచ్చటించారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో పవన్ కల్యాణ్‌తో మోహన్ యాదవ్ సమావేశమయ్యారు. ఈ భేటీలో ఏపీ, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన పలు కీలక అంశాలపై చర్చించారు. ముఖ్యంగా, నాగార్జునసాగర్–శ్రీశైలం టైగర్ రిజర్వ్ పరిధిలో పులుల సంరక్షణ చర్యలను బలోపేతం చేయడంపై మాట్లాడారు. అలాగే, జీవవైవిధ్య పరిరక్షణలో భాగంగా మధ్యప్రదేశ్ నుంచి గౌర్ (అడవి దున్నలు)ను చీూ=కు తరలించే ఒప్పందాన్ని వేగవంతం చేయాలని పవన్ కల్యాణ్ కోరారు. ఈ సందర్భంగా త్వరలోనే తాను మధ్యప్రదేశ్‌లో పర్యటిస్తానని పవన్ తెలిపారు. సమావేశం అనంతరం పవన్ కల్యాణ్.. మోహన్ యాదవ్‌ను ఉప్పాడ పట్టు శాలువాతో సత్కరించి, కొండపల్లి, శ్రీకాళహస్తి కళాకృతులతో పాటు అరకు కాఫీని బహూకరించారు. ప్రతిగా మోహన్ యాదవ్, శ్రీ ఓంకారేశ్వర స్వామి ప్రతిమను, జ్యోతిర్లింగ క్షేత్ర ప్రసాదాన్ని పవన్‌కు అందజేశారు.

నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం...

గెట్ రెడీ!: విజయసాయిరెడ్డి

మధ్య, ఆ రెండు కుల, మైనారిటీ కుటుంబాలు పోషిస్తున్న ఫ్యాక్షన్ల మధ్య ఓ సివిల్ వార్ నడుస్తోంది” అని ఆయన ఘాటుగా వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు ఎంత దారుణంగా ఉన్నాయో ఈ ఘటనలే నిదర్శనమని అన్నారు. కర్రలు, కత్తులు, గూండాలు, బౌన్సర్లు, నామినేషన్లు చించివేయడం, జీపులతో ఢీకొట్టడం, నెత్తురోడేలా దాడులు చేసుకోవడం వంటి దృశ్యాలు దేశవ్యాప్తంగా రాష్ట్ర పరువును తీస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే అరాచకం కొనసాగితే, 2029 నాటి సాధారణ ఎన్నికల్లో ఈ పార్టీలు నేరుగా బందిపోట్లకు, హత్యలు, మానభంగాలు, దొంగతనాల చరిత్ర ఉన్నవారికే టికెట్లు ఇచ్చే పరిస్థితి వస్తుందని ఆయన జోస్యం చెప్పారు. ఈ రెండు పార్టీలకు గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందని, ఒక మూడో ప్రత్యామ్నాయంతో సరికొత్త రాజకీయానికి యువత (జెన్–జీ) నడుం బిగించాలని పిలుపునిచ్చారు. “ఈ అరాచకం ఇకమీదటా కొనసాగాలా? లేక, ఈ రెండు పార్టీలకు గుణపాఠం నేర్పాలా? అన్నది నిర్ణయించుకోవాలి. నవంబర్ రెండో వారంలో అందరం కలుద్దాం... గెట్ రెడీ!” అంటూ తన పోస్టును ముగించారు.

మొదటి పేజీ తరువాయి

బెజవాడలో దసరా సందడి..

ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు తాగునీరు సహా ఇతర కనీస సౌకర్యాలను కల్పిస్తున్నారు. ఈ సాయంత్రం మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ ఇంద్రకీలాద్రిని సందర్శించనున్నారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం ఆయన ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. ఆ తర్వాత పున్నమి ఘాట్‌లో నిర్వహించనున్న ‘విజయవాడ ఉత్సవ్ 2.0’ కార్యక్రమంలో ఆయన హాజరుకానున్నారు. దసరా ఉత్సవాల వేళ ఇంద్రకీలాద్రి పరిసరాల్లో ఆధ్యాత్మికతతో కూడిన పండుగ వాతావరణం సంతరించుకుంది.

కూటమి అభ్యర్థులు గెలవాల్సిందే

కల్పించామన్నారు. క్షేత్రస్థాయిలో కూటమి నేతలు మిత్రధర్మం పాటిస్తూ కలుపుకొని వెళ్లాలని సూచించారు. తెదేపా నుంచి పోటీ చేసే 11 మేయర్ స్థానాలను 11 సామాజిక వర్గాలకు కేటాయించామన్నారు. 2024 ఎన్నికల ఫలితాలకు మించిన స్థాయిలో ఓట్ల శాతం పెరగాలని చెప్పారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి ఫలితాలు సాధించాల్సిందేనని పార్టీ నేతలకు దిశానిర్దేశం చేశారు. పంచాయతీ, ఎంపీటీసీ, జడ్పీటీసీ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి అభ్యర్థులు గెలవాల్సిందేనన్నారు. “ప్రజాభిప్రాయం, కేడర్ అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకొని అభ్యర్థుల ఎంపిక చేపట్టాం. పలు చోట్ల సమస్యలను సామరస్య పూర్వకంగా పరిష్కరించుకోవాలి. స్థానిక సంస్థల ఎన్నికల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించేలా వైకాపా వ్యవహరిస్తోంది. గొడ్డలి పార్టీ చర్యలను గమనిస్తూ ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేయాలి. ఆ పార్టీ కుట్రలను సమర్థంగా తిప్పికొట్టాలి” అని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు.

ఎగిరే కారు వచ్చేసింది..

వేగవంతమైన స్పోర్ట్స్ కారుగా రికార్డు సృష్టించనుంది. రోడ్‌స్టర్ అనే ఈ అత్యాధునిక విద్యుత్ కారును టెక్సాస్‌లోని స్పేస్‌ఎక్స్ కేంద్రంలో ప్రదర్శించారు. ఇందులో భాగంగా.. ఎత్తయిన వాలు మార్గంలో ఇది తలకిందులుగా ప్రయాణించడంతో పాటు ఒక్కసారిగా గాలిలోకి ఎగిరి కాసేపు చక్కర్లు కొట్టి, సురక్షితంగా నేలమీదకు వాలింది. స్పేస్‌ఎక్స్ అభివృద్ధి చేసిన కోల్డ్–గ్యాస్ థ్రస్టర్ల సాంకేతికతతో ఈ కారు గాలిలో విన్యాసాలు చేసింది. ఎదురు ఏదైనా వాహనం అడ్డువస్తే రెప్పపాటులోనే ఇది గాల్లోకి లేచి వేరే చోట సురక్షితంగా ల్యాండ్ అవుతుంది. ఇలాంటి వాహనాల వల్ల రోడ్డు ప్రమాద మరణాలు తగ్గుతాయని నిపుణులు చెబుతున్నారు. భవిష్యత్‌లో.. ఎగిరే కార్లు రాబోతున్నాయంటూ ఈ ప్రయోగానికి సంబంధించిన దృశ్యాలను టెస్లా అధినేత ఎలాన్ మస్క్ పంచుకున్నారు. అయితే ఈ విన్యాసాలను పూర్తిగా నియంత్రిత వాతావరణంలో నిర్వహించారు. సాధారణ రోడ్లపై ఈ కారు గాలిలోకి ఎగిరేందుకు భద్రతాపరమైన అనుమతులు ఇంకా లభించాల్సి ఉంది. 2017లో తొలిసారి ఈ కారు గురించి టెస్లా ప్రకటించింది. దీని ఉత్పత్తిని 2028 నాటికి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.

ఏపీని ‘సౌత్ బీహార్’గా మారుస్తున్నారు

టీడీపీ, వైసీపీలపై షర్మిల ఫైర్

పుంగనూరులో జరిగిన ఘర్షణలు రాష్ట్ర ఎన్నికల చరిత్రలో ఆందోళనకరమైన పరిణామాలని షర్మిల అన్నారు. ప్రశాంతంగా జరగాల్సిన ఎన్నికలను ఘర్షణలు, దాడులతో రణరంగంగా మారుస్తున్నారని విమర్శించారు. “కూటమిది నిజంగా పవిత్ర పాలనే అయితే దాడులు ఎందుకు? బలవంతపు ఏకగ్రీవాలు ఎందుకు? నామినేషన్లు వేయకుండా అడ్డుకోవడమెందుకు?” అని ఆమె ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. నాడు వైసీపీ హయాంలో హింసాకాండ జరిగితే, నేడు టీడీపీ హయాంలో అంతకుమించిన ఘోరాలు జరుగుతున్నాయని ఆమె పోల్చారు. నామినేషన్ కేంద్రాల వద్ద గూండాలు స్వైరవిహారం చేస్తుంటే ఎన్నికల సంఘం ఏం చేస్తోందని, శాంతిభద్రతలు కాపాడాల్సిన పోలీసులు ఎందుకు విఫలమవుతున్నారని షర్మిల నిలదీశారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని టీడీపీ సాగిస్తున్న ఈ దౌర్జన్య వైఖరిని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని స్పష్టం చేశారు. ప్రజాస్వామ్యంలో కక్ష సాధింపు రాజకీయాలకు, రక్తపాతానికి తావులేదని, అభివృద్ధి కోసం పోటీ పడాలి కానీ భౌతిక దాడులకు పాల్పడటం సరికాదని హితవు పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఆమె పలు డిమాండ్లు చేశారు. స్థానిక ఎన్నికలను స్వేచ్ఛగా, ప్రశాంతంగా నిర్వహించాలని, ప్రతి నామినేషన్ కేంద్రం వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేయాలని కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరూ నామినేషన్ వేసేలా చూడాలని, బలవంతపు ఏకగ్రీవాలను అడ్డుకోవాలని సూచించారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి పండుగ కావాలి కానీ, పగలు ప్రతీకారాలకు వేదిక కాకూడదని ఆమె పేర్కొన్నారు.

జీవీఎంసీ ఎన్నికలు: రెండో రోజు 272 నామినేషన్లు

మేయర్ పదవికి 7.. వార్డు సభ్యులకు 265 దాఖలు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,అక్టోబర్ 17:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026లో భాగంగా రెండో రోజు శనివారం మేయర్ పదవికి 7, వార్డు సభ్యుల స్థానాలకు 265 నామినేషన్లు దాఖలయ్యాయి. మేయర్ పదవికి వైఎస్సార్‌సీపీ, బీఎస్పీ, భారత చైతన్య యువజన పార్టీతో పాటు స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు సమర్పించారు. వార్డు సభ్యుల నామినేషన్లలో వైఎస్సార్‌సీపీ నుంచి 80, టీడీపీ నుంచి 69, జనసేన నుంచి 56, స్వతంత్రులుగా 41, బీజేపీ నుంచి 5, కాంగ్రెస్ నుంచి 3, సీపీఎం నుంచి 3, బీఎస్పీ నుంచి 2, సీపీఐ నుంచి 2, ఇతర పార్టీల నుంచి 4 నామినేషన్లు దాఖలయ్యాయి. అక్టోబర్ 16న 66, అక్టోబర్ 17న 265 నామినేషన్లు రావడంతో రెండు రోజుల్లో వార్డు సభ్యుల స్థానాలకు మొత్తం 331 నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల అధికారులు వెల్లడించారు.

జీవీఎంసీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కమిషనర్ కేతన్ గార్గ్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికలు--2026 నేపథ్యంలో భీమిలి, అనకాపల్లి జోన్ల కౌంటింగ్ కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌లను జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ శనివారం పరిశీలించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో భీమిలి జోన్‌కు కేటాయించిన ఎగ్జామినేషన్ బ్లాక్, అనకాపల్లి జోన్‌కు కేటాయించిన ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ బ్లాక్‌లలో ఏర్పాట్లను సమీక్షించారు. ఎన్నికల సామగ్రి భద్రత, మౌలిక సదుపాయాలు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమేష్, ముఖ్య పట్టణ ప్రణాళిక అధికారి ఎ. ప్రభాకర్ రావు, ఆర్‌టీవో, ఇంజినీరింగ్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఎన్నికల ఏర్పాట్లపై కేతన్ గార్గ్ సమీక్ష

పెందుర్తిలో స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల తనిఖీ

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:

జీవీఎంసీ రెండో సాధారణ ఎన్నికల నేపథ్యంలో పెందుర్తి జోన్ పరిధిలోని నాయుడుతోట, రవినగర్‌లో భాష్యం స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను జీవీఎంసీ కమిషనర్, అదనపు ఎన్నికల అధికారి కేతన్ గార్గ్ శనివారం పరిశీలించారు. ఎన్నికల సామగ్రి పంపిణీకి చేసిన ఏర్పాట్లను సమీక్షించి, ప్రక్రియ సజావుగా జరిగేలా అధికారులకు సూచనలు చేశారు. పెందుర్తి జోనల్ కార్యాలయంలో రిటర్నింగ్ అధికారుల గదులు, ఫిర్యాదుల విభాగం, హెల్ప్‌డెస్క్, సింగిల్ విండో వ్యవస్థలను పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్య పనులు, అవసరమైన మరమ్మతులను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. ఎన్నికల విధుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని కేతన్ గార్గ్ సూచించారు. ఈ పరిశీలనలో జీవీఎంసీ అదనపు కమిషనర్ రమేష్, జోనల్ కమిషనర్ హెచ్. శంకర్రావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడమే లక్ష్యం

చల్లా రామిరెడ్డి స్పాన్సర్‌షిప్‌తో కళ్లివానిపాలెంలో క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ఆనందపురం, అక్టోబర్ 17 సిటిజన్ టైమ్స్

నవరాత్రుల సందర్భంగా విశాఖపట్నం జిల్లా భీమిలి నియోజకవర్గం ఆనందపురం మండలం గంభీరం పంచాయతీ పరిధిలోని కళ్లివానిపాలెం గ్రామంలో కెవిపి సీజన్--1 క్రికెట్ టోర్నమెంట్‌ను కమిటీ సభ్యులు శనివారం ఉదయం ప్రారంభించారు. ఈ పోటీల్లో కెవిపి ఈగల్స్, కెవిపి హిట్టర్స్, కెవిపి వారియర్స్, కెవిపి పాంథర్స్ జట్లు పాల్గొంటున్నాయి. యువతను క్రీడలవైపు ప్రోత్సహించాలనే ఉద్దేశంతో గంభీరం పంచాయతీకి చెందిన జనసేన నాయకుడు చల్లా రామిరెడ్డి అలియాస్ సుబ్బు రూ.25 వేల విలువైన టీషర్ట్‌లను స్పాన్సర్ చేశారు. నవరాత్రుల సందర్భంగా ప్రతి ఏడాది ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా చల్లా రామిరెడ్డి మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఇటువంటి క్రీడా పోటీలతో యువతలో ఐక్యత, ఉత్సాహం, క్రమశిక్షణతో పాటు క్రీడాస్ఫూర్తి పెంపొందుతాయని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని యువతలో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికితీసేందుకు మరిన్ని పోటీలు నిర్వహించాలని ఆయన అభిప్రాయపడ్డారు. క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభంతో గ్రామంలోని యువతలో ఉత్సాహం నెలకొంది. క్రీడల ద్వారా స్నేహభావాన్ని పెంపొందించుకుంటూ ప్రతిభను చాటుకోవాలని నిర్వాహకులు ఆకాంక్షించారు.

నౌకాదళ రహస్యాల లీకేజీ కేసులో ఒకరి అరెస్ట్

నౌకలు, జలాంతర్గాముల కదలికల సమాచారం చేరవేత ఆరోపణలు.. రూ.8 వేల నగదు జమ అయినట్లు ఫిర్యాదు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్: అక్టోబర్ 17

భారత నౌకాదళానికి చెందిన నౌకలు, జలాంతర్గాముల కదలికలకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని గుర్తుతెలియని వ్యక్తికి చేరవేశారనే ఆరోపణలపై కిల్లో నరేష్ కుమార్ అనే వ్యక్తిపై మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంలో అధికారిక రహస్యాల చట్టం సహా సంబంధిత చట్టాల కింద తదుపరి చర్యలు చేపట్టారు. నేవల్ డాక్‌యార్డ్‌లోని మెరైన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థలో కాంట్రాక్ట్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నరేష్ కుమార్‌కు ఇన్‌స్టాగ్రామ్ ద్వారా గుర్తుతెలియని వ్యక్తితో పరిచయం ఏర్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం వాట్సాప్ ద్వారా నౌకాదళ కదలికలకు సంబంధించిన సమాచారాన్ని పంపించినట్లు, ఇందుకు ప్రతిఫలంగా ఆయన బ్యాంకు ఖాతాలో రెండు విడతల్లో రూ.8,000 జమ అయినట్లు ఆరోపణలు ఉన్నాయి. మొబైల్ ఫోన్ పోయిన తర్వాత స్నేహితుల ఫోన్ల ద్వారా కూడా ఆ వ్యక్తితో సంప్రదింపులు జరిపినట్లు ఫిర్యాదులో వెల్లడించారు. ఈ వ్యవహారంలో మరెవరైనా పాల్గొన్నారా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దేశ భద్రతకు సంబంధించిన సున్నితమైన సమాచారాన్ని అనధికారికంగా చేరవేయడం తీవ్రమైన నేరమని పోలీసులు హెచ్చరించారు.

జై దుర్గా భవాని సన్నిధిలో భక్తుల సందడి

నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 3 వేల మందికి అన్నదానం

ఆనందపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:

ఆనందపురం గ్రామంలోని ఎస్సీ, బీసీ కాలనీలో నిర్వహిస్తున్న జై దుర్గా భవాని నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం అమ్మవారి సన్నిధిలో భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 3 వేల మంది భక్తులకు అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఆనందపురం గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం అన్నప్రసాదాన్ని స్వీకరించారు. దీంతో అమ్మవారి సన్నిధిలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఎస్సీ, బీసీ కాలనీ ఫ్రెండ్స్ ఎవర్ యూత్ ఆధ్వర్యంలో ఈ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల సందర్భంగా భక్తులకు అన్నప్రసాదం అందించడం ఆనందంగా ఉందని నిర్వాహకులు తెలిపారు. అమ్మవారి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు.

స్థానిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు

ఈ నెల 28న జీవీఎంసీ ఎన్నికలు.. 30న ఓట్ల లెక్కింపు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

జిల్లాలో పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. శనివారం పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌లతో కలిసి ఎన్నికల ఏర్పాట్ల వివరాలను వెల్లడించారు. జీవీఎంసీ పరిధిలోని 120 వార్డులకు అక్టోబర్ 28న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ నిర్వహించి, అక్టోబర్ 30న ఓట్ల లెక్కింపు చేపడతామని తెలిపారు. నగర పరిధిలో 18,37,901 మంది ఓటర్లు ఉన్నారని, ఎన్నికల నిర్వహణకు అవసరమైన సిబ్బంది, పోలింగ్ కేంద్రాలు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను సిద్ధం చేస్తున్నామని పేర్కొన్నారు. జిల్లాలో నాలుగు జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు నవంబర్ 3న పోలింగ్, నవంబర్ 5న ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని 79 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఆయా ఎన్నికల తేదీలపై రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన మేరకు స్పష్టత వస్తుందని వివరించారు. ఎన్నికల నియమావళిని కఠినంగా అమలు చేస్తున్నామని, నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. జీవీఎంసీ ఎన్నికల ఫిర్యాదులకు 1800 425 00009, 95737 08855 నంబర్లను, గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికల ఫిర్యాదులకు 99898 91827 నంబరును సంప్రదించాలని సూచించారు. పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ జీవీఎంసీ ఎన్నికల బందోబస్తుకు 6,607 మంది పోలీసు సిబ్బందిని, గ్రామ పంచాయతీ ఎన్నికలకు 2,907 మంది సిబ్బందిని సమకూర్చుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు చేపడుతున్నామని వెల్లడించారు. జీవీఎంసీ ఎన్నికల్లో మేయర్ అభ్యర్థికి గులాబీ రంగు బ్యాలెట్ పత్రం, వార్డు సభ్యుడి అభ్యర్థికి తెలుపు రంగు బ్యాలెట్ పత్రం ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ఓటర్లు రెండు బ్యాలెట్ పత్రాలపై ఓటు వేసి, వాటిని ఒకే పెట్టెలో వేయాలని సూచించారు.

పరిషత్ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

ఎన్నికల నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి: కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలను నిబద్ధతతో, నిష్పక్షపాతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. శనివారం నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత్ బాగ్చితో కలిసి ఎన్నికల ఏర్పాట్లపై నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ నెల 19న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుందని, 21 నుంచి 23 వరకు నామినేషన్ల స్వీకరణ, నవంబర్ 3న పోలింగ్, 5న ఓట్ల లెక్కింపు జరుగుతాయని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 4 జెడ్పీటీసీ, 53 ఎంపీటీసీ స్థానాలకు 203 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాల్లో కనీస సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా కల్పించాలని, ఎన్నికల సిబ్బందికి శిక్షణ పూర్తి చేయాలని సూచించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. పోలీసు శాఖ తరఫున 6,607 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, డ్రోన్ల ద్వారా కూడా నిఘా ఉంచుతామని నగర పోలీస్ కమిషనర్ తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా జనసేన నుంచి నల్లా శ్రీధర్ ఎంపిక

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురంలో మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో కూటమి నాయకులతో నిర్వహించిన సమావేశంలో పి. గన్నవరం నియోజకవర్గ శాసనసభ్యులు, జనసేన పార్టీ అమలాపురం పార్లమెంట్ సమన్వయకర్త గిడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమలాపురం మున్సిపల్ చైర్‌పర్సన్ అభ్యర్థిగా జనసేన పార్టీ తరఫున నల్లా శ్రీధర్ ని ఎంపిక చేసినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా గిడ్డి సత్యనారాయణ, సానా సతీష్ ఆయనను దుశ్శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ, మున్సిపల్ ఎన్నికల్లో కూటమి బలపరిచిన అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతుతో కూటమి అభ్యర్థులను అఖండ మెజారిటీతో గెలిపించాలని కూటమి నాయకులకు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో పార్లమెంట్ పరిశీలకులు సానా సతీష్, బండారు శ్రీనివాసరావు, అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ,గుత్తుల సాయి ,గంధం పల్లంరాజు తో పాటు పలువురు కూటమి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలపై కూటమి సమరశంఖం

100 శాతం స్ట్రైక్ రేట్ లక్ష్యంగా ముందుకు సాగుతాం – మంత్రి వాసంశెట్టి సుభాష్

రామచంద్రపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఐక్యంగా ముందుకు సాగి మెరుగైన ఫలితాలు సాధించే లక్ష్యంతో కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసినట్టు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. రామచంద్రపురంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, పి. గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు గుత్తుల సాయి, గంధం పల్లంరాజు, కూటమి సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, ఏఎంసీ చైర్మన్ అక్కల రిశ్వంత్ రాయ్, నియోజకవర్గ పరిశీలకురాలు మజ్జి పద్మావతి సమావేశమై స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై సమీక్షించారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ...లి–గత ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేట్ సాధించాం, రాబోయే ఎన్నికల్లో 100 శాతం స్ట్రైక్ రేట్ సాధించడమే లక్ష్యం అని పేర్కొన్నారు– రామచంద్రపురం పట్టణంలో రూ.70 కోట్లతో, నియోజకవర్గ వ్యాప్తంగా రూ.270 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని, రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా లిమేడిశెట్టి శేషారావులిను కూటమి తరఫున ప్రకటిస్తున్నామని, ఆయనను గెలిపించాలని పిలుపునిచ్చారు.

అభివృద్ధి, సంక్షేమమే మా అజెండా – ఎంపీ సానా సతీష్

రాజ్యసభ సభ్యులు సానా సతీష్ మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రధాన అజెండా అని తెలిపారు. రామచంద్రపురం మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా ఉన్నత విద్యావంతుడు, ప్రముఖ వ్యాపారవేత్త మేడిశెట్టి శేషారావును ఎంపిక చేశామని, 32 వార్డులకు సమర్థులైన అభ్యర్థులను బరిలో నిలిపామని చెప్పారు. కోనసీమ జిల్లాలో, రాష్ట్రంలో కూటమి అభ్యర్థులు విజయకేతనం ఎగురవేస్తారని ధీమా వ్యక్తం చేశారు.

శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే జీఎంఆర్

జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకొని శనివారం జిన్నారం మున్సిపల్ కేంద్రంలో శ్రీ జిన్నారం ఏడుపాయల వనదుర్గ దేవాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన హై మాక్స్ లైట్స్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు వెంకటేశం గౌడ్, మున్సిపల్ చైర్మన్ జనార్దన్ మండల పార్టీ అధ్యక్షుడు రాజేష్, కౌన్సిలర్లు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ దేవరాయులకు గుర్రంకొండలో ఘననివాళి

గుర్రంకొండ అక్టోబర్ 17 సిటిజన్ టైమ్స్

విజయనగర సామ్రాజ్య వైభవాన్ని శిఖరాగ్రలకు చేర్చి సుపరిపాలన గావించిన మహనీయుడు, సాహిత్యం, కళలు పోషించి అనేక గ్రంథాలు రచించిన కవి సార్వ భౌముడు ఆంధ్ర భోజ బిరుదాంకితుడు ఐన విజయనగర సామ్రాజ్య మహా చక్రవర్తి శ్రీకృష్ణ దేవరాయల వర్ధంతి సందర్భంగా గుర్రంకొండ లో యువత ఆ మహనీయుని స్మృతికి బిజెపి రామాంజులు ఆధ్వర్యంలో ఘన నివాళులు సమర్పించారు.

ఎన్నికల నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు: జిల్లా ఎన్నికల పరిశీలనాధికారి ప్రశాంతి

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

స్థానిక సంస్థల ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల పరిశీలనాధికారి పి. ప్రశాంతి హెచ్చరించారు. శనివారం గోదావరి భవన్‌లో ప్రిసైడింగ్ అధికారులు, ఎన్నికల సిబ్బందికి నిర్వహించిన శిక్షణలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిబంధనలు, మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని సూచించారు. పోలింగ్ కేంద్రంలో ప్రిసైడింగ్ అధికారిదే పూర్తి బాధ్యతని, ఎలాంటి ఒత్తిళ్లకు లోనుకాకుండా నిబంధనల ప్రకారం నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. రెండు బ్యాలెట్ పత్రాల వినియోగంపై ఓటర్లకు స్పష్టమైన అవగాహన కల్పించాలని, ఎన్నికల రికార్డులను కచ్చితంగా నమోదు చేయాలని ఆదేశించారు. పోలింగ్ వివరాలను నిర్దేశిత యాప్‌లో ఎప్పటికప్పుడు నమోదు చేసి, బ్యాలెట్ బాక్సులను భద్రంగా అప్పగించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికల సిబ్బంది సమన్వయంతో పనిచేసి పోలింగ్‌ను

ప్రశాంతంగా, నిష్పక్షపాతంగా నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ వై. ఖోమ్ నైడియా దేవి, ఎస్పీ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి వి. సుబ్బారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కోనసీమ అందాలను సినిమా ద్వారా ప్రజలకు తెలపండి

– జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్

అమలాపురం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

కోనసీమ జిల్లాలోని ప్రకృతి అందాలు, పర్యాటక ప్రాంతాలు, దేవాలయాల విశిష్టతను సినిమా రూపంలో ప్రజలకు తెలియజేయాలని జిల్లా కలెక్టర్ ఆర్. మహేష్ కుమార్ చిత్ర దర్శకుడు, నిర్మాతలకు సూచించారు. వసుంధర ఆర్ట్స్ బ్యానర్ పై కొణిదెల పవన్ తేజ్ హీరోగా, రాజశేఖర్ యాదవ్ దర్శకత్వంలో నిర్మించనున్న నూతన చిత్రం షూటింగ్ ను వచ్చే నెలలో ప్రారంభించనున్నట్లు చిత్ర బృందం వెల్లడించింది. ఈ సినిమా చిత్రీకరణలో ఎక్కువ భాగాన్ని కోనసీమ జిల్లాలోనే నిర్వహించనున్నట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో చిత్ర దర్శకుడు రాజశేఖర్ యాదవ్, నిర్మాతలు గునిశెట్టి రాజేష్, వీరు యాదవ్, గుర్లింక కన్నా జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ ను కలిసి సినిమా చిత్రీకరణకు సంబంధించిన వివరాలను తెలియజేశారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో షూటింగ్ నిర్వహించేందుకు అవసరమైన అనుమతులు, సంబంధిత శాఖల సహకారం అందించాలని వారు కలెక్టర్ ను కోరారు. దీనిపై కలెక్టర్ స్పందిస్తూ... కోనసీమ జిల్లాలోని సహజసిద్ధమైన ప్రకృతి అందాలు, నదీతీర ప్రాంతాలు, గ్రామీణ వాతావరణం, పర్యాటక ప్రదేశాలు, ప్రసిద్ధ దేవాలయాల విశిష్టతను సినిమా ద్వారా ప్రేక్షకులకు పరిచయం చేయడంతో పాటు జిల్లా పర్యాటక అభివృద్ధికి, జిల్లాకు మరింత గుర్తింపు తీసుకురావడానికి చిత్రీకరణను వినియోగించుకోవాలని సూచించారు. సినిమా చిత్రీకరణకు అవసరమైన అనుమతులు, శాఖల పరంగా పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో డీఈఓ మహబూబ్ బాషా, డీఐపీఆర్ఓ సిహెచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. "కోనసీమ అందాలను సినిమాలో చూపండి – చిత్ర బృందానికి కలెక్టర్ సూచన".

దోమడుగులో ఘనంగా దేవి నవరాత్రి ఉత్సవాలు ప్రత్యేక పూజలు నిర్వహించిన కాట సుధా శ్రీనివాస్ గౌడ్

గుమ్మడిదల మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గుమ్మడిదల మున్సిపాలిటీ పరిధిలోని దోమడుగు గ్రామంలో మాజీ ఎంపీటీసీ గోవర్ధన్ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దుర్గామాత పూజా కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు కాట సుధా శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీ కాలరాత్రి దేవి అవతారంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కాట సుధా శ్రీనివాస్ గౌడ్‌ను ఘనంగా సన్మానించారు ఆమె మాట్లాడుతూ అమ్మవారి కృప కటాక్షం సిరి సంపదలు ప్రజలందరికీ ఉండాలని ఆమె వేడుకున్నట్లు తెలిపారు.

దుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన సీనియర్ నాయకులు చంద్రారెడ్డి

బొల్లారం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17

బొల్లారం డివిజన్ పరిధిలోని వెంకటరెడ్డి నగర్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానికులు ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి.చంద్రారెడ్డి కార్మిక రాష్ట్ర నాయకులు వి.వరప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దుర్గామాత'కు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులతో కలిసి భక్తులకు అన్నదాన ప్రసాదాన్ని వితరణ చేశారు. నిర్వాహకులు ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు రమణయ్య వెంకటేష్ వెంకట్ రెడ్డి వెంకటేష్ నాగి రెడ్డి వెంకట్ కృష్ణ సాయి సురేష్ సుబ్బు ఆశిష్ ఉత్సవ కమిటీ సభ్యులు భక్తులు కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

పులివెందులలో ఉద్రిక్తత.. పోలీసుల కాల్పులతో కలకలం!

వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలను అడ్డుకున్న పోలీసులు.. వాహనాల ధ్వంసం, బాష్పవాయువు ప్రయోగం, గాల్లోకి కాల్పులు జరిపినట్లు ఆరోపణలు

పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:

పులివెందులలో మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల నేపథ్యంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను పోలీసులు అడ్డుకోవడంతో వివాదం తలెత్తినట్లు సమాచారం. ఈ క్రమంలో పోలీసులకు, వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు మధ్య ఉద్రిక్తత చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైఎస్సార్‌సీపీ నేతల వాహనాలను పోలీసులు ధ్వంసం చేశారని, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి బాష్పవాయువు ప్రయోగించడంతో పాటు గాల్లోకి కాల్పులు జరిపారని వైఎస్సార్‌సీపీ వర్గాలు ఆరోపించాయి. ఎంపీ వై.ఎస్. అవినాష్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నేతలను పోలీసులు అడ్డుకున్నట్లు సమాచారం. నామినేషన్ల ప్రక్రియ సందర్భంగా చోటుచేసుకున్న ఈ పరిణామాలతో పులివెందులలో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఘటనకు దారితీసిన పరిస్థితులు, పోలీసుల చర్యలకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా నిర్ధారించాల్సి ఉంది. గమనిక: కాల్పులు, వాహనాల ధ్వంసం వంటి అంశాలపై అధికారిక నిర్ధారణ అందుబాటులో లేనందున, సంబంధిత వర్గాల ఆరోపణలుగానే పేర్కొనడం సముచితం.

దసరా ఉత్సవాల్లో నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:

దసరా ఉత్సవాలు, శోభాయాత్రలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. ఆర్. మహేష్ కుమార్, ఎస్పీ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఉత్సవాల నిర్వహణ, శాంతిభద్రతలు, ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. ఊరేగింపుల్లో ఇరుకైన రహదారులు, నివాస ప్రాంతాల్లో బాణసంచా కాల్చరాదని, అధికారులు గుర్తించిన ప్రదేశాల్లోనే కాల్చాలని కలెక్టర్ సూచించారు. అగ్నిమాపక శకటాలు, అంబులెన్సులు, వైద్య బృందాలను అందుబాటులో ఉంచాలని, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలను ముందుగానే ప్రకటించాలని ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించేలా ఫ్లెక్సీలు, కటౌట్లు ఏర్పాటు చేస్తే చర్యలు తీసుకుంటామని ఎస్పీ హెచ్చరించారు. శోభాయాత్ర వాహనాల ఫిట్‌నెస్ తనిఖీలు, డ్రైవర్లకు మద్యం పరీక్షలు నిర్వహించాలని, సున్నిత ప్రాంతాల్లో సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిఘా ఉంచుతామని తెలిపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్, ఆర్డీఓలు, పోలీసు అధికారులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నరసింహ స్వామి ఆలయం ముందు బోనాలు ఆటల సంబరాలు

సిటిజన్ టైమ్స్ ధర్మపురి అక్టోబర్ 17

ధర్మపురి పట్టణంలో శనివారం రోజున రాత్రి 7 గంటల సమయమున నవరాత్రుల్లో భాగంగా లక్షినర్సింహా స్వామి ఆలయం ముందు బోనాలు పెట్టి ఆటపటలతో గజ్జెల మ్రోతలతో డప్పుల చప్పులతో చిన్న పెద్దలు కలిసి చప్పట్లతో మరుమ్రోగింది. చూడడానికి పండగ వాతావరణం నెలకొంది. విషయం లోకి వస్తే దుర్గమ్మ వద్ద నుండి బోనాలు తీసుక వచ్చి నరసింహ స్వామి ఎదుట పెట్టి స్వామి కి చూపి అటపటలు వేషలు వేసి ఎగరడం వంటి విన్యాసాలు చేయడం జరిగినది. చూడదని కి ఎంతో సంతోషం గా భక్తి శ్రద్దలతో తనువులు పులకరించే విధంగా అలారించాయి. ఈ కార్యక్రమం చూడడానికి వచ్చి భక్తులు స్థానికులు పాల్గొన్నారు.

మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చి మహేశ్వరరావు మృతి

అమలాపురం: సిటిజన్ టైల్స్ అక్టోబర్ 17

అంబేద్కర్ కోనసీమ జిల్లా, అమలాపురం నియోజకవర్గం, అల్లవరం మండలం అల్లవరం గోపవరం కి చెందిన మాజీ ఎంపీ అయితాబత్తుల బుచ్చి మహేశ్వరరావు కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శనివారం కన్నుమూశారు. ఆయన మృతి పట్ల పలువురు ప్రముఖులు, నాయకులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకున్నారు.

హుస్నాబాద్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం

ఎల్లమ్మ చెరువు సుందరీకరణ, బతుకమ్మ ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్

హుస్నాబాద్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
హుస్నాబాద్ ఎల్లమ్మ చెరువు వద్ద బతుకమ్మ వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. శనివారం చెరువు సుందరీకరణ పనులు, నూతన మైసమ్మ ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. మహిళలకు ఇబ్బందులు కలగకుండా బారికేడ్లు, లైటింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హుస్నాబాద్‌ను పర్యాటకం, విద్య, వైద్యం, రహదారులు, క్రీడలు, సాగునీటి రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఎల్లమ్మ చెరువును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంతో పాటు గ్లాస్ బ్రిడ్జి, అర్బన్ ఫారెస్ట్ పార్కు వంటి అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. నియోజకవర్గంలో 250 పడకల ఆసుపత్రి నిర్మాణం, విద్యాసంస్థల ఏర్పాటు, రహదారుల అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. గౌరవెల్లి ప్రాజెక్టు కాలువల నిర్మాణానికి భూసేకరణ పూర్తయిన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు. రైతులు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని, నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. హుస్నాబాద్ నియోజకవర్గంలో 3,500 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, అర్హులైన పేదలకు ప్రాధాన్యతనిస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలను సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ రష్మీ పెరుమాళ్, మున్సిపల్ చైర్‌పర్సన్ దండి లక్ష్మి, వైస్ చైర్‌పర్సన్ చిత్తారి పద్మ, ఆర్డీవో రామ్మూర్తి, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే జీఎంఆర్

పటాన్చెరు సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17
పటాన్‌చెరు: పేదింటి ఆడబిడ్డల వివాహాలు తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకూడదనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు నిరుపేద కుటుంబాలకు ఆర్థిక అండగా నిలుస్తున్నాయని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ఎం డి ఆర్ ఫౌండేషన్ కో-ఫౌండర్ మాద్రి పృథ్వీరాజ్ అన్నారు. పటాన్‌చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి చేతుల మీదుగా నియోజకవర్గంలోని వివిధ గ్రామాలు, డివిజన్లకు చెందిన 160 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.1,60,18,500 విలువైన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మాద్రి పృథ్వీరాజ్ పాల్గొన్నారు.కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు పేద ప్రజలకు ఆర్థిక భరోసా కల్పిస్తున్నాయని పేర్కొంటూ, అర్హులైన ప్రతి ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని పృథ్వీరాజ్ సూచించారు లబ్ధిదారులు ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ధనలక్ష్మి దేవిగా దర్శనమిచ్చిన అంకాలమ్మ తల్లి

దసరా నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక అలంకరణ.. అమ్మవారిని దర్శించుకున్న భక్తులు



పులివెందుల, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
దసరా నవరాత్రుల సందర్భంగా పులివెందుల పట్టణంలోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మి దేవిగా ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ పుష్పాలు, అలంకరణలతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం పులివెందులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. భక్తిశ్రద్ధలతో అంకాలమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని వివిధ రూపాల్లో అలంకరించడంతో ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. అమ్మవారి అనుగ్రహంతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని భక్తులు ప్రార్థించారు.

దారి తప్పిన వ్యక్తికి అండగా నిలిచిన ట్రైనీ కానిస్టేబుళ్లు

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17
మానవత్వంతో స్పందించిన విశాఖ ట్రైనీ పోలీస్ కానిస్టేబుళ్లు దారి తప్పిన వ్యక్తికి సహాయం అందించారు. పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు శనివారం సాయంత్రం జగదాంబ జంక్షన్‌లో విజువల్ పోలీసింగ్ నిర్వహిస్తున్న ట్రైనీ కానిస్టేబుళ్లు గందరగోళ స్థితిలో ఉన్న ఓ వ్యక్తిని గుర్తించారు. విచారించగా, తాను విజయనగరానికి చెందిన వ్యక్తినని, ఇంటికి వెళ్లే మార్గం తెలియక ఇబ్బంది పడుతున్నానని తెలిపాడు. వెంటనే స్పందించిన కానిస్టేబుళ్లు సంబంధిత సిబ్బందికి సమాచారం అందించి, అతడిని పోలీస్ స్టేషన్‌కు తరలించి సురక్షితంగా ఉంచారు. ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు ఆపదలో ఉన్నవారికి సహాయం చేయడంలోనూ పోలీసులు ముందుంటారని ఈ ఘటన మరోసారి చాటిచెప్పింది.

నామినేషన్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తాం: ఎస్పీ దామోదర్

విజయనగరం, సిటిజన్ టైమ్స్: అక్టోబర్ 17:
మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో విజయనగరం మున్సిపల్ కార్యాలయం, నెల్లిమర్ల నగర పంచాయతీ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లను జిల్లా ఎస్పీ ఎఆర్ దామోదర్, ఐపీఎస్ పరిశీలించారు. ఎన్నికలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టినట్లు తెలిపారు. నామినేషన్ కేంద్రాల పరిధిలో నిబంధనలు పాటించాలని, అభ్యర్థితో పాటు ముగ్గురికి మాత్రమే కేంద్రంలోకి అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సోషల్ మీడియాలో అసత్య వార్తలను ప్రచారం చేయవద్దని, ఆధారాలు లేకుండా రూ.10 వేలకు మించి నగదు తీసుకెళ్లవద్దని సూచించారు. కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు బలగాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన సమాజం

నేడు ప్రకృతి పంటల సంత తొలి వార్షికోత్సవం.. రైతులు, వినియోగదారులు తరలిరావాలి

విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
ప్రకృతి పంటల సంత మొదటి వార్షికోత్సవానికి ఆదివారం ఉదయం 9 గంటలకు తరలిరావాలని భారతీయ కిసాన్ సంఘ్ జాతీయ కార్యవర్గ సభ్యులు జలగం కుమార్ స్వామి పిలుపునిచ్చారు. ఆంధ్ర యూనివర్సిటీ ఇంజనీరింగ్ హాస్టళ్ల ఎదురుగా ఉన్న ఏ హబ్ వద్ద ఈ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఫుడ్ ప్రాసెసింగ్ విభాగం కార్యదర్శి చిరంజీవి చౌదరి ముఖ్యఅతిథిగా హాజరవుతారని వెల్లడించారు. గత 52 వారాలుగా విశాఖ ప్రజలు ప్రకృతి పంటల సంతను ఆదరిస్తున్నారని, ఉత్తరాంధ్ర రైతులు ప్రకృతి పద్ధతుల్లో పండించిన పంటలను ఇక్కడ విక్రయిస్తున్నారని పేర్కొన్నారు. రైతులు రసాయన ఎరువులు, క్రిమిసంహారకాల వినియోగాన్ని తగ్గించి ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, వినియోగదారులు సైతం ప్రకృతి పంటలను కొనుగోలు చేయాలని కోరారు. దీనివల్ల నేల, గాలి, నీటి కాలుష్యం తగ్గి ప్రజల ఆరోగ్యానికి, పర్యావరణానికి మేలు జరుగుతుందని తెలిపారు.

సెలవు రోజుల్లోనూ నామినేషన్ సేవలు అందించాలి

కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసిన వైసీపీ నేత పినిపే శ్రీకాంత్

అమలాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా ఈ నెల 19, 20 తేదీల్లో ప్రభుత్వ కార్యాలయాల్లో ప్రత్యేక సిబ్బందిని అందుబాటులో ఉంచాలని వైసీపీ అమలాపురం నియోజకవర్గ సమన్వయకర్త డా. పినిపే శ్రీకాంత్ జిల్లా కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు శనివారం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వరుస సెలవుల కారణంగా నామినేషన్ పత్రాలు, నిరభ్యంతర ధ్రువపత్రాలు (ఎన్‌ఓసీలు), ఇతర ధ్రువపత్రాల పొందడంలో అభ్యర్థులు ఇబ్బందులు పడకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, వంటెద్దు వెంకన్నాయుడు, ఎన్నికల పరిశీలకులు కటకంశెట్టి ఆదిత్య, తోరం గౌతం, పొలమూరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కొడకంచి అమ్మవారి మండపాన్ని దర్శించుకున్న వి.ప్రవీణ్ రెడ్డి

జిన్నారం మండలం సిటిజన్ టైమ్స్ అక్టోబర్ 17
జిన్నారం మున్సిపాలిటీ పరిధిలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. కొడకంచి గ్రామంలో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత మండపాన్ని బొల్లారం యువజన కాంగ్రెస్ నాయకులు వి.ప్రవీణ్ రెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మాత చల్లని చూపులతో ప్రజలంతా సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు ఆయనను ఘనంగా సన్మానించారు. అనంతరం నిర్వాహకులతో కలిసి ఆయన భక్తులకు అన్న ప్రసాదాన్ని వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక యువజన నాయకులు నరేష్ గౌడ్ మాజీ ఉప సర్పంచ్ అభిలాష్ గౌడ్ నవీన్ గౌడ్ సాయి నిర్వాహకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.'

ఎన్నికల వేళ అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు

రౌడీ షీటర్లకు పోలీసుల హెచ్చరిక..

పీడీ యాక్ట్ అమలుకు సూచన

అనకాపల్లి, సిటిజన్ టైమ్స్: అక్టోబర్ 17
రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు అనకాపల్లి జిల్లా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఐపీఎస్ ఆదేశాల మేరకు నర్సీపట్నం, కసింకోట పోలీస్ స్టేషన్ల పరిధిలోని రౌడీ షీటర్లు, పాత నేరస్థులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎన్నికల సమయంలో ఓటర్లను భయపెట్టినా, గొడవలకు దిగినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించినా ఉపేక్షించేది లేదని ఎస్పీ హెచ్చరించారు. అవసరమైతే పీడీ యాక్ట్‌తో పాటు కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ప్రజలు ప్రశాంత వాతావరణంలో ఎన్నికల్లో పాల్గొనేలా పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా పనిచేస్తోందని తెలిపారు.

స్థానిక ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

కాకినాడ, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు--2026 నిర్వహణలో భాగంగా కాకినాడలోని పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేయనున్న స్ట్రాంగ్ రూమ్‌లు, ఓట్ల లెక్కింపు కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా భద్రతా ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, ప్రవేశ మార్గాలను సమీక్షించారు. స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద సీసీ కెమెరాల నిఘా, 24 గంటల పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం అన్ని ఏర్పాట్లను పటిష్టంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ లక్ష్మణరావు, కళాశాల ప్రిన్సిపల్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో ఘనంగా బతుకమ్మ వేడుకలు

గుమ్మడిదల మండలం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17:
తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్ అన్నారు. గుమ్మడిదల మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ దశరథ్ ఆధ్వర్యంలో శనివారం బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి చైర్మన్ చిన్నపాపని కుమార్ గౌడ్, వైస్ చైర్మన్ చిమ్ముల సంధ్య గోవర్ధన్ రెడ్డి, తహసీల్దార్ పరమేశం, ఎంపిడీఓ ఉమాదేవి హాజరయ్యారు. మహిళా కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఐక్యతకు, ఆత్మగౌరవానికి ప్రతీక అని చైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నాయకులు, మహిళలు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ధనలక్ష్మి దేవిగా దర్శనం ఇచ్చిన శ్రీఈశ్వరంబ

దొనకొండ, సిటిజన్ టైమ్స్: అక్టోబర్ 17
మండల కేంద్రంలోని విరాట్ నగర్ లో గల శ్రీ ఆనంద ఆశ్రమంలో దసరా మహోత్సవంలో భాగంగా ఆనంద ఆశ్రమంలో ఏడవ రోజు ధనలక్ష్మిదేవిగా దర్శనమిచ్చారు ఉదయం 6 గంటల నుండి అమ్మవారికి విశేషఅభిషేకాలు ప్రత్యేక అలంకరణ చేసి అమ్మవారికి అష్టోత్తర శతనామావళి సహస్రనామార్చన సామూహిక కుంకుమ పూజ నిర్వహించి పంచభక్ష పరమాన్నాలు నైవేద్యాలు సమర్పించి మహిళలచే సామూహిక హారతులు ఇచ్చారు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొంనారు వచ్చిన భక్తులకు ఆశ్రమ అర్చకులు మణి బాబు శర్మ తీర్థ ప్రసాదములు అంద చేశారు ఆశ్రమ నిర్వాహకులు అల్పాహారం ఏర్పాటు చేశారు ఎనిమిదవ రోజు వనదుర్గాదేవిగా శ్రీ ఈశ్వరీమహాదేవి దర్శనమిస్తుందని శ్రీ భైరవానంద స్వామి తెలియజేశారు.

స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలి

ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైనప్పటి నుంచి కౌంటింగ్ పూర్తి అయ్యేంతవరకు ప్రజల అప్రమత్తంగా ఉండాలి

ఎలక్షన్ కమిషన్ నియమ నిబంధనలను పాటించాలి

మండల ప్రజలకు ఎంపీడీవో రమేష్ బాబు ఎస్సై నాగేంద్రరావు సూచనలు సలహాలు

కొమరోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

కొమరోలు మండలంలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు తమ వంతు సహాయ సహకారాలు అందించాలని కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు ఎస్సై కోట నాగేంద్రరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం కొమరంలోని మండల పరిషత్ సమావేశపు హాలులో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో ఎంపీడీవో రమేష్ బాబు మాట్లాడుతూ, మండల పరిషత్ జిల్లా పరిషత్ ఎన్నికల నోటిఫికేషన్ ఈనెల 19 తేదీన విడుదల కానున్నదని ఆయన తెలిపారు. మండలంలోని 12 ఎంపీటీసీ స్థానాలకు ఒక జడ్పిటిసి స్థానానికి ఈనెల 23వ తేదీలోగా నామినేషన్లు స్వీకరిస్తారని, నామినేషన్ల పరిశీలన అనంతరం నెల 27వ తేదీ నామినేషన్ ఉపసరించుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. పోలింగ్ నవంబర్ 3వ తేదీన నిర్వహిస్తారని, 5వ తేదీన కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు వెల్లడిస్తారని ఆయన తెలిపారు. అభ్యర్థులు నామినేషన్ దాఖలు సందర్భంగా ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను పాటించాలని ఆయన తెలిపారు.పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని, ఎన్నికలు మ గిసేంతవరకు ప్రజలు, అభ్యర్థులు, రాజకీయ నాయకులు, ఎన్నికల కమిషన్ నియమ నిబంధనలను అనుసరిస్తూ ప్రవర్తించాలని ఆయన కోరారు. ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో సజావుగా ఎన్నికలు

నిర్వహించేందుకు మండలంలోని అన్ని వర్గాల ప్రజలు రాజకీయ పార్టీల ప్రతినిధులు అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఎస్సై నాగేంద్రరావు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇలాంటి అవాంఛనీయ సంఘటనలు శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా ఎన్నికల ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు పోలీసులకు అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కోరారు. పోలింగ్ కేంద్రాల వెలుపల 144 సెక్షన్ అమలులో ఉంటుందని, అందువల్ల ప్రజలు పోలీసుల నియమ నిబంధనలను సూచన సలహాలను పాటించాలని కోరారు. 50 వేల రూపాయలకు మించి నగదు తో కానీ లేదా బంగారు, వెండి ఆభరణాలతో ప్రయాణించేవారు తప్పనిసరిగా వాటి సంబంధించిన రసీదులు కలిగి ఉండాలని, లేనియెడల నిబంధనలకు వ్యతిరేకంగా పట్టుబడిన నగదును ఆభరణాలను తాము స్వాధీనం చేసుకొని ఎన్నికల అనంతరం వాటికి తగిన ఆధారాలు చూపించి వాటిని పొందవచ్చుని ఆయన తెలిపారు. మండలంలోని గ్రామాలలో ఇతర మండలాలు జిల్లాలో చెందిన వ్యక్తులు ఉండరాదని, అలాంటి వారు ఎవరైనా ఉంటే గ్రామాలు వదిలి వారి స్వస్థలాలకు వెళ్లిపోవాలని ఆయన కోరారు. పోలింగ్ కేంద్రాల వెలుపల గట్టి పోలీసు బందోబస్తు ఉంటుందని, అందువల్ల ఓటర్లు ఎలాంటి భయాందోళనకు, గురి కాకుండా తమ ఓటును నిర్భయంగా వినియోగించుకోవాలని ఆయన కోరారు. వాట్సాప్ ల ద్వారా ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా వచ్చే వదంతులను నమ్మవద్దని అంతేకాక అలాంటి వాటిని ఇతరులకుషేర్ చేయవద్దని, అలా షేర్ చేసిన వారిపై పోలీసులు చట్టపరమైన చర్యలు తీసుకుంటారని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి మునిసేంతవరకు అన్ని వర్గాల ప్రజలు పోలీసుల సూచనలు సలహాలు నిబంధనలను పాటిస్తూ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు సహకరించాలని ఆయన కోరారు.

సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ ని సందర్శించిన కదిరి బాబురావు కళాశాల విద్యార్థులు

సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

సియస్ పురం కదిరి బాబురావు వ్యవసాయ కళాశాలలో మూడవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు విద్యాపరమైన అవగాహన పర్యటనలో భాగంగా, విద్యార్థులు ఒంగోలులోని సెంట్రల్ వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ (సిడబ్ల్యూసి)ను శనివారం సందర్శించారు.ఈ సందర్భన సమయంలో వేర్‌హౌస్ మేనేజర్ అయిన డాక్టర్ కె. అనిల్ కుమార్ యాదవ్ విద్యార్థులతో సంభాషించి, వేర్‌హౌస్ కార్యకలాపాలు మరియు పనులకు సంబంధించిన వివిధ అంశాలను వివరించారు.వ్యవసాయ ఉత్పత్తుల స్వీకరణ మరియు నిల్వ, శాస్త్రీయ వేర్‌హౌసింగ్ పద్ధతులు, ఇన్వెంటరీ నిర్వహణ, నిల్వ చేసిన వస్తువుల పరిరక్షణ మరియు నిర్వహణ, భద్రతా చర్యలు, డాక్యుమెంటేషన్, మరియు వేర్‌హౌస్ యొక్క మొత్తం పనితీరుపై ఆయన వివరించారు.ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ ప్రొఫెసర్స్ పీ. శ్రీవిద్య, డాక్టర్ బసవరాజు, సంగీత,తదితరులు ఉన్నారు.

విద్యుత్ మోటార్లకు అదనపు పైపులు ఏర్పాటు

నీరు అందని బోర్లను గుర్తించి అదనపు పైపులు ఏర్పాటు చర్యలు తీసుకున్న కొమరోలు పంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత.

కొమరోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

కొమరోలు గ్రామపంచాయతీ పరిధిలోని విద్యుత్ బోరులకు శనివారం అదనపు పైపులను ఏర్పాటు చేశారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా భూగర్భ జలాలు రోజురోజుకు అడుగంటుతున్నాయి దీనితో విద్యుత్ మోటార్లకు సక్రమంగా నీరు అందక పోవటంతో విద్యుత్ మోటార్లు అరకొరగా పనిచేస్తున్నాయి. సదరు సమస్యను గుర్తించిన కొమరోలు గ్రామపంచాయతీ అభివృద్ధి అధికారిని వై గీత శనివారం కొమరోలు పట్టణంలో తమ సిబ్బందితో కలిసి పర్యటించి విద్యుత్తు మోటార్లకు అదనపు పైపులను ఏర్పాటు చేయించారు. దీనితో పట్టణంలోని వీధులకు నీటి సరఫరా మెరుగు కావడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తూ అధికారులకు ధన్యవాదాలు తెలుపుతున్నారు. ఆ కార్యక్రమంలో స్వర్ణ గ్రామం కొమరోలు కార్యదర్శి జనార్దన్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మూడో వార్డులో సిపిఎం అభ్యర్థిగా రూబెన్ నామినేషన్

మార్కాపురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

మార్కాపురం మున్సిపల్ ఎన్నికల్లో సిపిఎం తరపున మూడో వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థిగా పందీటి రూబెన్ శనివారం నామినేషన్ దాఖలు చేశారు.వార్డు ప్రజల మద్దతుతో, పార్టీ శ్రేణులతో కలిసి మార్కాపురం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన నామినేషన్ కేంద్రానికి చేరుకుని ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలను అందజేశారు. రూబెన్ వెంట సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డీకేఎం రఫీ, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కే విజయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి దగ్గుపాటి సోమయ్య మాట్లాడుతూ నిత్యం ప్రజా సమస్యలపై పోరాడుతున్న పార్టీ సిపిఎం అని, మార్కాపురం మున్సిపల్ కౌన్సిల్లో ప్రజా సమస్యలపై గళం విప్పేందుకు సిపిఎంకు అవకాశం కల్పించాలని మూడో వార్డు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.

మాజీ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య మృతి

సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

మండల కేంద్రం లోని సి ఎస్ పురం మాజీ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య ఒంగోలులోని వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందారు. ఆయన మృతి పట్ల టీడీపీ నాయకులు, గ్రామస్తులు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సుదీర్ఘకాలం రేషన్ షాపు డీలర్ గా పనిచేస్తూ ప్రజలకు సేవలందించి అందరి మన్ననలు పొందారు. అలాగే గ్రామంలోని పురాతన, మహిమాన్విత శ్రీ కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ఆలయ కమిటీకి తన వంతు విలువైన సలహాలు, సూచనలు అందిస్తూ కృషి చేశారు. ఉపసర్పంచ్ గా గ్రామాభివృద్ధిలోనూ కీలక పాత్ర పోషించారు.ప్రజలతో సత్సంబంధాలు కలిగి, ప్రజలందరికీ తెలిసిన వ్యక్తిగా ప్రతి ఒక్కరిని నవ్వుతూ ఆప్యాయంగా పలకరించే పెద్దాయన నరసయ్య అకాల మరణం అత్యంత బాధాకరమని , మంచి వ్యక్తిని కోల్పోయామని పలువురు గ్రామస్తులు తెలిపారు ఈ సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మాలకొండ ఆదాయం రూ. 13,38,488

వలేటివారిపాలెం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

అయ్యవారిపల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండలో వెలసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీ నరసింహస్వామి వారికి శుక్రవారం వివిధ రూపాల ద్వారా రూ. 13,38,488 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. శ్రీనివాసులు రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. **ఆదాయ వివరాలు:** అష్టోత్తరం ద్వారా రూ. 12,300, కుంకుమార్చన ద్వారా రూ. 23,680, వివాహములు ద్వారా రూ. 7,000, తలనీలాల ద్వారా రూ. 68,600, వాహన పూజల ద్వారా రూ. 5,440, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 5,00,800, స్థలపురాణం ద్వారా రూ. 40, రూముల అద్దెల ద్వారా రూ. 26,920, కవర్ల ద్వారా రూ. 7,975, లడ్డూ ప్రసాదం ద్వారా రూ. 2,22,305, అన్నదానం ద్వారా రూ. 4,33,080 (ఆన్ లైన్ తో కలిపి), విరాళాల ద్వారా రూ. 30,348 ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఆలయ అర్చకులు గౌరీశంకర్, నృసింహాచార్యులు స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు.

భైరవకోనలో వైభవంగా శరన్నవరాత్రి వేడుకలు

సరస్వతి దేవిగా దర్శనమిచ్చిన త్రిముఖ దుర్గాదేవి

సి ఎస్ పురం, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

నల్లమల అటవీ ప్రాంతంలోని అంబవరం కొత్తపల్లి పంచాయతీ పరిధిలో గల ప్రముఖ పర్యాటక శైవక్షేత్రం భైరవకోనలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వహణాధికారి వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఆలయ అర్చకులు ఘనంగా నిర్వహించారు ఉత్సవాల్లో భాగంగా త్రిముఖ దుర్గాదేవి అమ్మవారిని సరస్వతీ దేవిగా విశేషంగా అలంకరించడంతో అమ్మవారి దివ్యరూపం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంచామృత అభిషేకాలు, కుంకుమార్చన, బిల్వార్చనతో పాటు హోమాది పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. జ్ఞానం, విద్య, వివేకానికి ప్రతీకగా కొలువుదీరిన సరస్వతీ దేవిని దర్శించుకుంటే విద్యార్థులకు విద్యాబుద్ధులు, భక్తులకు జ్ఞానసంపద, సకల శుభాలు కలుగుతాయని భక్తులు విశ్వసిస్తారు. శరన్నవరాత్రుల్లో అమ్మవారిని వివిధ రూపాల్లో ఆరాధించడం, హోమాల ద్వారా లోక కళ్యాణార్థం హోమాలు వేదమంత్రాల నడుమ పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని త్రిముఖ దుర్గాదేవి అమ్మవారితోపాటు భైరవేశ్వర స్వామి, నగరసభ స్వామి వివిధ శివలింగాలను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు అనంతరం తీర్థప్రసాదాలను స్వీకరించారు ఈ

కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ ముప్పాళ్ళ శ్యామ్ సుందర్ రాజు, ఆలయ కార్యనిర్వాహణాధికారి వంశీకృష్ణారెడ్డి, ఎం శ్రీనివాసరాజు, పవన్ కుమార్ రాజు, ప్రధాన అర్చకులు కంబాలదిన్నె వెంకట నరసయ్య, అర్చకులు సుధాకర్ శర్మ, రామ్మూర్తి, కిషోర్, ఉభయకర్తలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపల్ ఎన్నికల వేళ గిద్దలూరులో భారీ బందోబస్తు

నిఘా నేత్రాల ను ఏర్పాటు, పలు నిఘా నేతలకు మరమ్మతులు

గిద్దలూరు ఓ ఎస్ డి , డీఎస్పి సీఐల ఆధ్వర్యంలో నిఘా

గిద్దలూరు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

గిద్దలూరు మున్సిపల్ ఎన్నికల నామినేషన్ కేంద్రం వద్ద పరిసరాలను, పరిశీలించిన ఓ ఎస్ డి నవజ్యోతి మిశ్రా, ఆధ్వర్యంలో నామినేషన్ కేంద్రమై మున్సిపల్ కార్యాలయం వద్ద భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు కొన్ని రాయల సీమ ప్రాంతాల్లో జరుగుతున్న సంఘటనలు దృష్టిలో ఉంచుకొని గట్టి భద్రత ఏర్పాట్లను పోలీసులు చేశారు నామినేషన్ కేంద్రం వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నామినేషన్ కేంద్రం కు అటు ఇటు 100మీటర్ ల దూరంలో బారికేండ్లు ఏర్పాటు చేసి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు . నామినేషన్ వేసే వారిని వారి వెంట నాలుగైదు మందిని నామినేషన్ కేంద్రంలో లోకి పంపుతున్నారు. ఆప్రాంతంలో తీసునికీలు నిర్వహిస్తున్నారు ఇటు కుమ్మరి ఆమం కట్ట వద్ద , గాంధీ బొమ్మ సెంటర్లో బారికేడ్లను ఏర్పాటు చేశారు. ఈ పోలీస్ చర్యలు ప్రశాంత వాతావరణం లో నామినేషన్ ప్రక్రియ జరిగేందుకు దోహదపడ్డాయి. కొత్తవారు జొరబడకుండా గట్టి చర్యలు చేపట్టారు. జిల్లా ఉన్నతాధికారులు కారులు గిద్దలూరు తిష్ఠ వేసి పరిస్థితులు గమనిస్తున్నారు. ఏదేమైనా రెండవ రోజు నామినేషన్ల ప్రక్రియ జోరుగా ప్రశాంత వాతావరణంలో జరిగాయి.

కొమరోలు మండలంలోని సర్పంచ్‌ల పదవులకు రిజర్వేషన్లు ఖరారు

కొమరోలు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి బీసీలకు రిజర్వేషన్

కొమరోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

కొమరోలు మండలంలోని 14 గ్రామపంచాయతీ సర్పంచ్ పదవులు రిజర్వేషన్లు ఖరారు చేశారని కొమరోలు ఎంపీడీవో రమేష్ బాబు తెలిపారు. కొమరోలు మండలం 14 గ్రామ పంచాయతీలు ఉండగా వాటిల్లో కొమరోలు గ్రామపంచాయతీ సర్పంచ్ పదవిని బీసీ జనరల్ కు రిజర్వ్ చేశారు. అల్లినగరం గ్రామపంచాయతీ సర్పంచ్ పదవి బిసిమహిళకు, బాదినేని పల్లె బీసీ మహిళకు, బ్రాహ్మణపల్లె ఎస్సీ జనరల్ కు,ఇడమ కళు ్ళ ఓసి జనరల్ కు,కొమరోలు బీసీ జనరల్, ముక్తాపురం ఓసి మహిళ, నల్లగుంట్ల బీసీ మహిళ, పుల్లారెడ్డి పల్లె ఓసి మహిళ, రాజుపాలెం ఓసి మహిళ, రెడ్డిచెర్ల ఓసి మహిళ, సూరివారిపల్లి ఎస్సీ మహిళ, తాటిచెర్ల ఓసీ జనరల్ కు రిజర్వు చేసినట్లుగా ఎంపీడీవో తెలిపారు.

గ్రామ రక్షకులు గ్రామ దేవతలు

– ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పి వెంకట శ్రీనివాస్

ఒంగోలు, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

సనాతన హిందూ సంప్రదాయంలో గ్రామ దేవతల ఆరాధన అనాదిగా ఉందని ప్రకాశంజిల్లా రచయితల సంఘం అధ్యక్షులు, ప్రముఖ ఆధ్యాత్మిక ఉపన్యాసకులు పొన్నూరు వేంకట శ్రీనివాసులు అన్నారు. దేవీ శరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా కేశవస్వామిపేట లోని శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి వారి దేవస్థానంలో మంత్రి ప్రగడ నరసింహారావు స్మృత్యర్థం ఏర్పాటు చేసిన ఆధ్యాత్మిక ప్రవచన కార్యక్రమంలో రెండవ రోజు లిగ్రామ దేవతలు - ఆరాధనలి అనే అంశంపై ప్రవచనం చేశారు. సాక్షాత్తు పార్వతీదేవి అంశతో పోలేరమ్మ, అంకమ్మ, ముత్యాలమ్మ, పోచమ్మ, బంగారమ్మ, మారెమ్మ, ఎల్లమ్మ అనే ఏడుగురు అక్కాచెల్లెళ్ళు అవతరించారని వీరే గ్రామ దేవతలగా గ్రామాలకు రక్షకులుగా ఆరాధించబడుతున్నారని అన్నారు. వీరికి తోడుగా విష్ణుశక్తి అంశంగా పోతరాజు అవతరించారని తెలిపారు. గతంలో మలేరియా, మసూచి లాంటి ప్రాణాంతక వ్యాధులు ప్రాబలినప్పుడు గ్రామ ప్రజలను కాపాడి పునర్జన్మయిచ్చే దేవతగా గ్రామ దేవతలను ఆరాధించే వారని, అలానే కరువు కాటకాలనుంచి గ్రామాన్ని రక్షించే దేవతా స్వరూపిణిగా అమ్మకు కొలుపులు, జాతరలు నిర్వహించే వారిని అన్నారు. 101 మంది గ్రామ దేవతలు వివిధ నామాలతో ఆయా గ్రామాల పొలిమేరలలో పూజలు అందుకుంటున్నారని అన్నారు. గ్రామ దేవతల ఆరాధన, పూజా



కైంకర్యాలు సర్వ మానవ సమానత్వాన్ని ప్రతిబింబిస్తాయిని చెప్పారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకొని సరస్వతీ దేవి చిత్రపటానికి అర్చకస్వామి రాంబాబు ఆచార్యులు పూజా కార్యక్రమాన్ని జరిపించారు. కార్యక్రమ నిర్వాహకులు మంత్రి ప్రగడ ప్రసాద్, ఆలయ ఈవో రావెళ్ల శివశంకర్, అక్కినేని కళా పరిషత్ అధ్యక్షులు కల్లగుంట కృష్ణయ్య, ఆనందమయ సాహితీ సంస్థ ప్రధాన కార్యదర్శి అన్ను విజయ కుమారి, ప్రముఖ గాయకులు మొవ్వ నాగేశ్వరరావు, ఐ. మురళీకృష్ణ, సాహితీ విమర్శకులు ఓరుగంటి ప్రసాద్, వ్యాఖ్యత గుఱ్ఱం కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

19 న జరగ వలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం రద్దు

ఒంగోలు కలెక్టరేట్, సిటిజన్ టైమ్స్, అక్టోబర్ 17

ఈ నెల 19 వ తేదీ సోమవారము ఒంగోలులోని కలెక్టరు వారి కార్యాలయం పిజి ఆర్ఎస్ భవనం నందు జరుగవలసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమము "మహర్నవమి" పండుగ సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సెలవు దినముగా ప్రకటించినందున రద్దు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి పి వెంకట రమణ ఒక ప్రకటనలో తెలిపారు. కావున జిల్లాలోని సుధీర ప్రాంత ప్రజలందరూ గమనించాలని ఆయన కోరారు.

ఆరోగ్యం

పచ్చి ఉల్లిపాయతో షుగర్‌కు చెక్..

మధుమేహులకు అద్భుత ప్రయోజనాలు!

ప్రతి భారతీయ వంటగదిలో తప్పనిసరిగా ఉండే ఉల్లిపాయ కేవలం రుచికి మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. ముఖ్యంగా మధుమేహం (డయాబెటిస్) ఉన్నవారికి పచ్చి ఉల్లిపాయ ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. దీనిని రోజూ ఆహారంలో చేర్చుకోవడం వల్ల రక్తంలోని చక్కెర స్థాయిలను సహజంగా నియంత్రించవచ్చు.

ఉల్లిపాయలో 'క్వెర్సెటిన్' అనే శక్తిమంతమైన యాంటీ ఆక్సిడెంట్ ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడంలో కీలకపాత్ర పోషిస్తుంది. అలాగే, ఉల్లిపాయలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు శరీరంలో ఇన్సులిన్ సెన్సిటివిటీని మెరుగుపరచడానికి సహాయపడతాయి. దీనివల్ల కణాలు గ్లూకోజ్‌ను సమర్థవంతంగా గ్రహించి, షుగర్ లెవెల్స్ అదుపులో ఉంటాయి.

ప్రధాన ప్రయోజనాలు ఇవే:

గుండె ఆరోగ్యం: మధుమేహం ఉన్నవారికి గుండె జబ్బుల ప్రమాదం ఎక్కువ. ఉల్లిపాయలోని యాంటీ-ఇన్‌ఫ్లమేటరీ గుణాలు రక్తపోటును తగ్గించి, చెడు కొలెస్ట్రాల్ (%ఉఈఉ%) స్థాయిలను నియంత్రించి గుండెను కాపాడతాయి.

జీర్ణవ్యవస్థకు మేలు: ఉల్లిలో ఉండే ఫైబర్, ప్రీబయోటిక్స్ జీర్ణక్రియను నెమ్మదింపజేస్తాయి. ఫలితంగా, చక్కెర రక్తంలోకి త్వరగా చేరకుండా నివారించవచ్చు. ఇది జీర్ణవ్యవస్థ ఆరోగ్యానికి కూడా దోహదపడుతుంది.

రోగనిరోధక శక్తి: ఉల్లిపాయలోని యాంటీఆక్సిడెంట్లు శరీరంలో మంటను తగ్గించి, రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి.

ఈ ప్రయోజనాలు పూర్తిగా పొందాలంటే ఉల్లిపాయను వండటం కంటే పచ్చిగా తినడమే ఉత్తమం. సలాడ్లు, రైతా, శాండ్‌విచ్‌లు లేదా కచంబర్ రూపంలో దీనిని సులభంగా మన రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవచ్చు.



పెద్ద పేగు క్యాన్సర్‌కు పిప్పళ్లతో చెక్..

పరిశోధనలో కీలక ఆవిష్కరణ!

పిప్పళ్లలోని పిప్లార్టైన్‌తో క్యాన్సర్ కణాల నాశనం

కీమోథెరపీకి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే అవకాశం

ఎన్ఐటీ రూర్కెల శాస్త్రవేత్తల బృందం అధ్యయనం

మన వంటిళ్లలో సులభంగా కనిపించే మసాలా దినుసు పిప్పళ్లు (తోక మిరియాలు) ప్రాణాంతకమైన పెద్ద పేగు క్యాన్సర్ (కొలన్ క్యాన్సర్)ను నివారించగలవని తాజా పరిశోధనలో తేలింది. పిప్పళ్లలో సహజంగా లభించే 'పిప్లార్టైన్' (పైపర్‌లాంగమీన్) అనే రసాయనానికి క్యాన్సర్ కణాలను సమర్థంగా నాశనం చేసే శక్తి ఉందని శాస్త్రవేత్తలు గుర్తించారు. రూర్కెలలోని ఎన్ఐటీ పరిశోధకులు, బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ నార్త్ కరోలినాకు చెందిన బృందాలు సంయుక్తంగా ఈ అధ్యయనం నిర్వహించాయి. ప్రస్తుతం పెద్ద పేగు క్యాన్సర్‌కు కీమోథెరపీ ద్వారా చికిత్స అందిస్తున్నారు. దీనికి ప్రత్యామ్నాయ వైద్య విధానాలపై పరిశోధన చేస్తున్న క్రమంలో శాస్త్రవేత్తలు ఈ కీలక విషయాన్ని కనుగొన్నారు. పిప్లార్టైన్‌ను పెద్ద పేగు క్యాన్సర్ కణాలపై ప్రయోగించినప్పుడు అద్భుతమైన ఫలితాలు వచ్చినట్లు పరిశోధకులు తెలిపారు. ఈ ఆవిష్కరణ క్యాన్సర్ చికిత్సలో ఒక వరం లాంటిదని వారు అభిప్రాయపడుతున్నారు. ఈ అధ్యయనానికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రముఖ సైన్స్ జర్నల్ 'బయోఫ్యాక్టర్స్'లో ప్రచురించారు.

మీ ఊపిరితిత్తుల ఆరోగ్యం ఎలా ఉంది?

ఇంట్లోనే ఈజీగా టెస్ట్ చేసుకోండి!

దేశంలో విపరీతంగా పెరుగుతున్న కాలుష్యం, మారిన జీవనశైలి, ధూమపానం వంటి కారణాలతో చాలామందిలో ఊపిరితిత్తుల ఆరోగ్యం ఆందోళనకరంగా మారుతోంది. శ్వాస సంబంధిత సమస్యలు పెరిగిపోతున్న ఈ తరుణంలో, ఆస్పత్రికి వెళ్లకుండానే ఇంట్లో ఊపిరితిత్తుల పనితీరును అంచనా వేసేందుకు మూడు సులభమైన మార్గాలను 'టైమ్స్ ఆఫ్ ఇండియా' తన కథనంలో సూచించింది. ఈ పరీక్షలు మన శ్వాస సామర్థ్యాన్ని తెలుసుకోవడానికి, సమస్యలను ముందుగా గుర్తించడానికి సహాయపడతాయి.

1. హోమ్ స్పైరోమెట్రీ

ఇది ఊపిరితిత్తుల పనితీరును తెలుసుకోవడానికి ఒక ప్రామాణికమైన పద్ధతి. ప్రస్తుతం మార్కెట్లో స్మార్ట్‌ఫోన్‌కు కనెక్ట్ అయ్యే పోర్టబుల్ స్పైరోమీటర్లు అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా గాలిని ఎంత బలంగా, ఎంత వేగంగా బయటకు వదులుతున్నారో కొలవవచ్చు. ఆస్తమా లేదా సీఓపీడీ వంటి సమస్యలు ఉన్నవారు దీని ద్వారా తమ ఆరోగ్యాన్ని ట్రాక్ చేసుకోవచ్చు.

2. శ్వాస ఆపడం, బెలూన్ పరీక్ష

ఎలాంటి పరికరాలు లేకుండా ఊపిరితిత్తుల సామర్థ్యాన్ని పరీక్షించడానికి ఇది చాలా సులభమైన మార్గం. లోతుగా శ్వాస తీసుకుని, కనీసం 30 నుంచి 50 సెకన్ల పాటు ఆపగలిగితే ఊపిరితిత్తులు ఆరోగ్యంగా ఉన్నట్టు. 20 సెకన్ల కన్నా తక్కువ సమయం ఆపగలిగితే వైద్యుడిని సంప్రదించడం మంచిది. అలాగే, ఒకే శ్వాసలో బెలూన్‌ను 8 అంగుళాల వరకు ఊదగలిగితే మీ లంగ్స్ పనితీరు బాగున్నట్లే.

3. ఆరు నిమిషాల నడక పరీక్ష

ఈ పరీక్ష ద్వారా ఊపిరితిత్తులతో పాటు గుండె ఆరోగ్యం, కండరాల బలాన్ని కూడా అంచనా వేయవచ్చు. ఆరు నిమిషాల వ్యవధిలో సమతలంగా ఉన్న ప్రదేశంలో ఎంత దూరం నడవగలరో చూసుకోవాలి. ఆరోగ్యవంతులు సాధారణంగా 400 నుంచి 700 మీటర్ల వరకు నడవగలరు. దీనికంటే తక్కువ దూరం నడిస్తే ఊపిరితిత్తులు లేదా గుండె సంబంధిత సమస్యలు ఉండవచ్చని భావించాలి. ఈ పరీక్ష చేసేటప్పుడు పల్స్ ఆక్సిమీటర్‌తో రక్తంలో ఆక్సిజన్ స్థాయిలను కూడా గమనిస్తే మరింత స్పష్టత వస్తుంది.

గమనిక: ఈ పరీక్షలు కేవలం ప్రాథమిక అంచనా కోసమే. శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, దీర్ఘకాలిక దగ్గు, ఛాతీలో నొప్పి వంటి లక్షణాలు ఉంటే వెంటనే వైద్యుడిని సంప్రదించడం చాలా ముఖ్యం.

సంగీతంతో స్వస్థత..

ఆపరేషన్ ముందు మ్యూజిక్ వింటే తొందరగా కోలుకుంటారట!

ఢిల్లీలోని లోక్ నాయక్ ఆసుపత్రి,

మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ అధ్యయనంలో వెల్లడి

రోగికి ఆందోళనను, ఆపరేషన్ సమయంలో

నొప్పిని తగ్గిస్తుందని పరిశోధకుల వివరణ

సుమారు ఏడాది పాటు 50 మంది రోగులపై

ప్రయోగాత్మకంగా పరీక్షించిన వైద్యులు

శస్త్రచికిత్స సమయంలో సంగీతం వినిపించడం వల్ల రోగి తొందరగా కోలుకుంటారని తాజా అధ్యయనంలో వెల్లడైంది. ఆపరేషన్ సమయంలో ఇతరత్రా ప్రయోజనాలనూ గమనించామని ఈ అధ్యయనంలో పాల్గొన్న వైద్య బృందం పేర్కొంది. ఈమేరకు ఢిల్లీలోని లోక్ నాయక్ ఆసుపత్రి, మౌలానా ఆజాద్ మెడికల్ కాలేజీ సంయుక్తంగా నిర్వహించిన ఈ అధ్యయనంలో కీలక విషయాలు వెల్లడయ్యాయి. ఆపరేషన్ సమయంలో రోగికి సంగీతం వినిపించడం వల్ల మిగతా రోగులతో పోలిస్తే మత్తుమందు తక్కువ మోతాదు సరిపోయిందని వైద్యులు తెలిపారు. ఆపరేషన్ సమయంలో సాధారణంగా రోగులు ఆందోళనకు గురవుతారని చెప్పారు. అయితే, సంగీతం వినడం వల్ల ఈ ఆందోళన తగ్గడాన్ని కూడా గమనించినట్లు తెలిపారు. శారీరక నొప్పిని, ఆపరేషన్ తర్వాత కోలుకునే సమయాన్ని సంగీతం వినడం ద్వారా తగ్గించవచ్చని తమ పరిశోధనలో తేలిందన్నారు. 2023 మార్చి నుంచి 2024 జనవరి వరకు 50 మందికి పైగా రోగులపై ఈ అధ్యయనం నిర్వహించినట్లు లోక్ నాయక్ ఆసుపత్రి వైద్యుల బృందం తెలిపింది. ఇందులో పాల్గొన్న రోగుల్లో 18 సంవత్సరాల వయసు నుంచి 65 ఏళ్ల వయసున్న వారు ఉన్నారని వివరించింది. ఈ రోగులకు గాల్ బ్లాడర్ తొలగించేందుకు శస్త్రచికిత్స నిర్వహించామని, ఆపరేషన్ సమయంలోను, ఆ తర్వాత కూడా వారికి మంద్ర స్థాయిలో ఫ్లూట్ వాయిద్యంతో సంగీతం వినిపించామని తెలిపింది. ఆపరేషన్ థియేటర్ లో రోగికి సంగీతం వినిపించడం వల్ల మందుల మోతాదు తగ్గిందని, సాధారణంగా ఆపరేషన్ సమయంలో రోగికి ఇచ్చే మత్తుమందు, నొప్పిని, ఆందోళనను తగ్గించే మందుల మోతాదులో గణనీయమైన మార్పును గుర్తించామని పేర్కొంది. ఆపరేషన్ విజయవంతంగా పూర్తిచేశాక మిగతా వారితో పోలిస్తే సంగీతం వింటూ ఆపరేషన్ చేయించుకున్న వారు వేగంగా కోలుకున్నారని వైద్యులు తెలిపారు.

ప్రజారోగ్యానికి పెనుముప్పుగా యాంటీబయాటిక్స్..

యాక్షన్ ప్లాన్ విడుదల చేసిన ప్రభుత్వం

యాంటీబయాటిక్స్ విచ్చలవిడి వాడకానికి చెక్

మందులకు లొంగని సూక్ష్మజీవుల కట్టడికి కేంద్రం కొత్త ప్రణాళిక

2025-29 కాలానికి ఎన్‌ఏపీ-ఏఎంఆర్ 2.0 విడుదల

డాక్టర్ చీటీ లేకుండా యాంటీబయాటిక్స్ అమ్మకాలపై నిషేధం

ప్రజారోగ్యానికి పెను సవాలుగా మారుతున్న యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్) సమస్యను ఎదుర్కొనేందుకు కేంద్ర ప్రభుత్వం పటిష్ఠమైన కార్యాచరణతో ముందుకొచ్చింది. శక్తిమంతమైన యాంటీబయాటిక్స్‌కు కూడా లొంగని మొండి సూక్ష్మజీవుల (సూపర్‌బగ్స్) వ్యాప్తిని అరికట్టడమే లక్ష్యంగా 2025-2029 కాలానికి 'నేషనల్ యాక్షన్ ప్లాన్ ఆన్ యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎన్‌ఏపీ-ఏఎంఆర్) 2.0'ను విడుదల చేసింది. ఈ ప్రణాళిక ప్రధానంగా ఆరు కీలక అంశాలపై దృష్టి సారించనుంది. ఈ కొత్త విధానంలో భాగంగా యాంటీబయాటిక్స్ వాడకంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించనున్నారు. పాఠశాల విద్యార్థుల నుంచి ఆరోగ్య కార్యకర్తల వరకు అందరికీ దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. అదే సమయంలో, డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా యాంటీబయాటిక్స్ అమ్మడాన్ని పూర్తిగా నిషేధించనున్నారు. దేశవ్యాప్తంగా ల్యాబ్‌ల సామర్థ్యాన్ని పెంచి, ఏ ప్రాంతంలో ఏ బ్యాక్టీరియా మందులకు లొంగడం లేదనే దానిపై పటిష్ఠ నిఘా ఏర్పాటు చేస్తారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రతా ప్రమాణాలు పెంచడం ద్వారా ఇన్ఫెక్షన్ల వ్యాప్తిని అరికట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీనివల్ల అనవసర మందుల వాడకం తగ్గుతుంది. పాత మందులు పనిచేయని కారణంగా, కొత్త యాంటీబయాటిక్‌లు, టీకాలు, తక్కువ ఖర్చుతో కూడిన డయాగ్నస్టిక్ కిట్‌ల అభివృద్ధి కోసం పరిశోధనలను ప్రోత్సహించనున్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కూడా కేటాయిస్తారు. ఈ సమస్యను సమగ్రంగా ఎదుర్కోవడానికి కేవలం ఆరోగ్య శాఖే కాకుండా వ్యవసాయం, పశుసంవర్ధక, పర్యావరణ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలని కేంద్రం నిర్ణయించింది.

ఒకే మూడ్.. ఒకే టెంప్లేట్.. బన్నీ సినిమాకు మొదట్లోనే ట్విస్ట్!

టాలీవుడ్ లో ఇప్పుడు కొత్త సమస్య మొదలైంది. ఏ పెద్ద సినిమా చూసినా ఒకే తరహా టెంప్లేట్, ఒకే మూడ్ కనిపిస్తోంది. హీరోలందరూ తెరపై సరికొత్తగా కనిపించాలని తాపత్రయపడుతున్నప్పటికీ.. చివరికి అందరూ ఒకే రకమైన డార్క్, రస్టిక్ ప్రపంచాల్లోకే అడుగుపెడుతున్నారు. బాక్సాఫీస్ దగ్గర ఏదో ఒక సినిమా క్లిక్ అవ్వగానే, మిగిలిన డైరెక్టర్లంతా తమ హీరోలను కూడా అదే మూస ధోరణిలోకి నెట్టేస్తున్నారనే చర్చ ఇప్పుడు ఫిల్మ్ సర్కిల్స్ లో జోరుగా సాగుతోంది.

శ్రీకాంత్ ఓదెల డైరెక్షన్ లో నాని చేసిన 'ది ప్యారడైజ్', బుచ్చిబాబు దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన 'పెద్ది' ప్రాజెక్టుల విషయంలో ఈ పోలికలు ఎక్కువగా వినిపించాయి. ఈ రెండు భారీ చిత్రాలు రా అండ్ రస్టిక్ నేపథ్యంలో సాగే ఇంటెన్స్ డ్రామాలే. అయితే స్క్రీన్ పై కనిపించే డార్క్ విజువల్స్ నుంచి హీరో ఎలివేషన్లు, హెవీ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ వరకు రెండింటి మధ్య ఉన్న డిఫరెన్స్ చూసి.. ఇవి రెండూ ఒకే ఫార్మాట్ లో అటు ఇటు తిప్పి తీసినట్లు ఉన్నాయనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి.స్టార్టింగులో ఇలాంటి రస్టిక్ అవతారాలు, రక్తపాతం ఆడియన్స్ కు కాస్త థ్రిల్ ఇచ్చాయి. కానీ వరుసగా ప్రతి స్టార్ హీరో అదే మట్టి గెటప్, అదే గ్యాంగ్ స్టర్ నేపథ్యంతో వస్తుంటే థియేటర్లలో ఫ్రెష్ నెస్ పూర్తిగా దెబ్బతింటోంది. సినిమా టైటిల్ మారినా చూసే విజువల్స్ లో తేడా లేకపోవడంతో ఆడియన్స్ లో క్రమంగా విసుగు మొదలవుతోంది. క్రియేటివిటీ అంటే స్క్రీన్ మొత్తం నలుపు, ఎరుపు రంగులతో నింపేయడం కాదనే విమర్శలు ఇండస్ట్రీ వర్గాల నుంచే వస్తున్నాయి.ఈ రొటీన్ ఫార్ములా సెగ ఇప్పుడు అల్లు అర్జున్ లోకేష్ కనగరాజ్ ప్రాజెక్ట్-ూూ23 కు కూడా తగిలింది. ఈ క్రేజీ కాంబినేషన్ సెట్ అవ్వగానే బన్నీ లుక్ కోసం ముంబైలో ప్రత్యేకంగా ఒక లుక్ టెస్ట్ వీడియోను షూట్ చేశారట. ఆ వీడియోతోనే సినిమాకు సంబంధించిన ఫస్ట్ ఇంపాక్ట్ ఇవ్వాలని మేకర్స్ ప్లాన్ చేశారు. అయితే సరిగ్గా అదే టైమ్ లో మరో స్టార్ హీరో గ్యాంగ్ స్టర్ మూవీ నుంచి అచ్చం అలాంటి డార్క్ టోన్ తో ఉన్న ప్రమోషనల్ వీడియో బయటకు వచ్చింది.వేరే సినిమా వీడియోతో తమ కాన్సెప్ట్ సింక్ అవుతుండటాన్ని గమనించిన ూూ23 టీమ్ వెంటనే అప్రమత్తమైంది. ఇప్పుడు తాము ఆ వీడియోను రిలీజ్ చేస్తే వేరే సినిమాను కాపీ కొట్టినట్లు ఉంటుందనే ఉద్దేశంతో, తమ పాత ప్రమోషనల్ ప్లాన్ ను ప్రస్తుతానికి పక్కన పెట్టినట్లు తెలుస్తోంది. తమ లుక్ టెస్ట్ ను మళ్లీ కొత్తగా ఎలా డిజైన్ చేయాలనే దానిపై లోకేష్ టీమ్ పునరాలోచనలో పడింది. ఒకే ట్రెండ్ ను అందరూ ఫాలో అవ్వడం వల్ల మొదట్లోనే ఇలాంటి సమస్యలు ఎదురవుతున్నాయి.తెలుగు సినిమాకు అసలైన బలం వైవిధ్యమైన కథలను, లోతైన ఎమోషన్లను చూపించడమే. ఒక హీరోకు లేదా ఒక దర్శకుడికి వర్కౌట్ అయిన స్టైల్ ఇండస్ట్రీలో అందరికీ సెట్ అవుతుందనే గ్యారెంటీ ఉండదు. ప్రతి ప్రాజెక్ట్ కు ఒక విలక్షణమైన ఐడెంటిటీ ఉన్నప్పుడే ప్రేక్షకులు ఆసక్తి చూపిస్తారు. పాత సక్సెస్ ఫార్ములాలను జిరాక్స్ తీయడం మానేసి, రూట్ మార్చి కొత్త ఐడియాలతో వస్తేనే దర్శకులకు బాక్సాఫీస్ దగ్గర లాంగ్ రన్ ఉంటుంది.

ముంబై ఇండియన్స్ హెడ్ కోచ్ ఎవరు? ద్రవిడ్, గిల్‌క్రిస్ట్, మోర్గాన్‌కు నో ఛాన్స్!

ఐపీఎల్ 2026లో ఎదురైన దారుణ వైఫల్యం (9వ స్థానం) తర్వాత ఐదుసార్లు ఛాంపియన్ ముంబై ఇండియన్స్ , హెడ్ కోచ్ మహేల జయవర్ధనే పరస్పర అంగీకారంతో విడిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ముంబై ఇండియన్స్‌కు తదుపరి ప్రధాన కోచ్‌గా ఎవరు వ్యవహరిస్తారనే అంశం ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చ నడుస్తోంది.

రేసు నుంచి తప్పుకున్న రాహుల్ ద్రవిడ్:

టీమిండియాను 2024 టీ20 ప్రపంచ కప్ విజేతగా నిలిపిన రాహుల్ ద్రవిడ్ ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నారనే ప్రచారాన్ని ప్రముఖ క్రికెట్ మీడియా సంస్థ క్రిక్‌బజ్ ఖండించింది.

కుటుంబానికి ప్రాధాన్యం: ద్రవిడ్ ప్రస్తుతం తన కుటుంబానికి, ప్రత్యేకించి తన కుమారులు (సమిత్, అన్వయ్) క్రికెట్ కెరీర్‌పై దృష్టి పెట్టాలని చూస్తున్నారు. 2026 సీజన్‌కు ముందే రాజస్థాన్ రాయల్స్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న ద్రవిడ్‌కు ఐపీఎల్ లీగ్ నుంచి భారీ ఆఫర్లు వచ్చినప్పటికీ, ఆయన ఐపీఎల్ 2027 సీజన్‌లో కోచింగ్ బాధ్యతలు చేపట్టడానికి ఆసక్తిగా లేరని స్పష్టమైంది.

ఇదే బాటలో ఆస్ట్రేలియా దిగ్గజం ఆడమ్ గిల్‌క్రిస్ట్, ఇంగ్లాండ్ మాజీ కెప్టెన్ ఇయాన్ మోర్గాన్ కూడా తాము అందుబాటులో లేమని ఐపీఎల్ ఫ్రాంచైజీలకు తెగేసి చెప్పారు.

ముంబై ఇండియన్స్ కోచ్ రేసులో ఉన్నది వీళ్లే:

మైఖేల్ హస్సీ : చెన్నై సూపర్ కింగ్స్ (జూఖ) బ్యాటింగ్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న హస్సీ, ఐపీఎల్ ఫ్రాంచైజీలతో చర్చలు జరుపుతున్నారు. ఆయన ముంబై ఇండియన్స్ రేసులో ప్రధానంగా ఉండే అవకాశం ఉంది.

ఆడ్రియన్ బిరెల్ : సౌతాఫ్రికాకు చెందిన ఈ సీనియర్ కోచ్ ప్రస్తుతం ఫ్రాంచైజీ క్రికెట్‌లో హాట్ కేక్‌లుగా మారారు. ూూ20 లీగ్‌లో సన్‌రైజర్స్ ఈస్టర్న్ కేప్ జట్టుకు ఏకంగా 3 టైటిళ్లు, 4 ఫైనల్స్ అందించారు.

ఆరోన్ ఫించ్ : ఆస్ట్రేలియా టీ20 ప్రపంచ కప్ విజేత కెప్టెన్ ఆరోన్ ఫించ్ కూడా కొన్ని ఐపీఎల్ జట్లతో చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.

కొత్త కోచ్ నిర్ణయంపైనే సపోర్ట్ స్టాఫ్ భవితవ్యం:

ముంబై ఇండియన్స్ యాజమాన్యం తమ నూతన హెడ్ కోచ్ ఎంపిక కోసం త్వరలోనే ఇంటర్వ్యూలు ప్రారంభించనుంది.

కొత్తగా వచ్చే హెడ్ కోచ్‌కే ప్రస్తుత సపోర్ట్ స్టాఫ్ అయిన లసిత్ మలింగ, పారస్ మాంబ్రే (బౌలింగ్ కోచ్‌లు), కీరన్ పొలార్డ్ (బ్యాటింగ్ కోచ్), కార్ల్ హాప్‌కిన్సన్ (ఫీల్డింగ్ కోచ్)లను కొనసాగించాలా వద్దా అనే నిర్ణయాధికారాన్ని ఫ్రాంచైజీ వదిలేసింది.

బుమ్రా ఇన్.. ఐదుగురు ఔట్! న్యూజిలాండ్ సిరీస్‌కు భారత టెస్ట్ జట్టులో భారీ మార్పులు

న్యూజిలాండ్ పర్యటనలో భాగంగా నవంబర్ 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రెండు టెస్టు మ్యాచ్‌ల సిరీస్ కోసం భారత జాతీయ ఎంపిక కమిటీ బీసీసీఐ ద్వారా 16 మంది సభ్యులతో కూడిన జట్టును ప్రకటించింది. గత ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్‌తో పోలిస్తే, ఈ పర్యటన కోసం టీమిండియాలో ఏకంగా 5 కీలక మార్పులు చోటు చేసుకున్నాయి. అందరి దృష్టిని ఆకర్షించిన ప్రధాన అంశం జస్‌ప్రీత్ బుమ్రా పునరాగమనం, మోకాలి గాయం కారణంగా లంక సిరీస్‌కు దూరమైన బుమ్రా, ఇప్పుడు పూర్తి ఫిట్‌నెస్ సాధించి కివీస్ గడ్డపై భారత పేస్ దళానికి నాయకత్వం వహించబోతున్నాడు.

బౌలింగ్ విభాగంలో కీలక మార్పులు:

న్యూజిలాండ్ వేగవంతమైన పిచ్‌లను దృష్టిలో పెట్టుకుని సెలెక్టర్లు ఐదుగురు ఫాస్ట్ బౌలర్లకు జట్టులో చోటు కల్పించగా, ముగ్గురు స్పిన్నర్లను మాత్రమే ఎంపిక చేశారు.

ఆకాశ్ దీప్ రీ-ఎంట్రీ: వెన్ను గాయం కారణంగా దాదాపు ఏడాది కాలంగా టెస్టులకు దూరంగా ఉన్న ఆకాశ్ దీప్ మళ్లీ టెస్టు జట్టులోకి వచ్చాడు.

అన్షుల్ కంబోజ్ కమ్‌బ్యాక్: ఇంగ్లాండ్‌పై మాంచెస్టర్ టెస్టులో ఆడిన తర్వాత జట్టుకు దూరమైన అన్షుల్ కంబోజ్ మళ్లీ సెలెక్టర్ల పిలుపునందుకున్నాడు.

సాయి సుదర్శన్, సుందర్ రీ-ఎంట్రీ: గాయాల కారణంగా శ్రీలంక టూర్ కు దూరమైన సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్‌లు తిరిగి తుది జట్టు రేసులోకి వచ్చారు.

జట్టు నుంచి వైదొలిగిన ఐదుగురు ఆటగాళ్లు:

శ్రీలంక సిరీస్‌లో అత్యధిక వికెట్లు తీసిన స్పిన్నర్ మానవ్ సుతార్ కు కివీస్ కండిషన్స్ దృష్ట్యా చోటు దక్కలేదు. అలాగే సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్, గుర్నూర్ బ్రార్, ఆకిబ్ నబీలను ఈ పర్యటనకు పక్కనపెట్టారు.

ఇన్ : జస్‌ప్రీత్ బుమ్రా, ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, వాషింగ్టన్ సుందర్, అన్షుల్ కంబోజ్.

ఔట్ : మానవ్ సుతార్, ఆకిబ్ నబీ, గుర్నూర్ బ్రార్, సర్ఫరాజ్ ఖాన్, సారాంశ్ జైన్.

భారత టెస్టు జట్టు :

శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), యశస్వి జైస్వాల్, కెఎల్ రాహుల్ (వైస్ కెప్టెన్), దేవదత్ పడిక్కల్, రిషభ్ పంత్ (ఫిట్‌నెస్‌కు లోబడి), ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, అన్షుల్ కంబోజ్, జస్‌ప్రీత్ బుమ్రా, ప్రసిద్ధ్ కృష్ణ (ఫిట్‌నెస్‌కు లోబడి), ఆకాశ్ దీప్, సాయి సుదర్శన్, నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, మహమ్మద్ సిరాజ్.

వాన దెబ్బకు ఐదో టీ20 రద్దు.. భారత్-విండీస్ సిరీస్ ఇలా ముగిసింది!

భారత్, వెస్టిండీస్ మధ్య జరగాల్సిన నిర్ణయాత్మక ఐదో టీ20 మ్యాచ్‌కు వరుణుడు అడ్డుపడ్డాడు. బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరిగిన ఈ మ్యాచ్ వర్షం కారణంగా ఫలితం తేలకుండానే రద్దయింది. దీంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్ 2-2తో ముగిసింది. వర్షం అంతరాయం మధ్య కాసేపు సాగిన ఆటలో భారత బ్యాటర్లు పరుగుల సునామీ సృష్టించినా, చివరకు వరుణుడిదే పైచేయి అయింది.వర్షం కారణంగా మ్యాచ్ ఆలస్యంగా ప్రారంభమైంది. టాస్ గెలిచిన వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ ఫీల్డింగ్ ఎంచుకున్నాడు. బ్యాటింగ్‌కు దిగిన టీమిండియా ఆరంభం నుంచే దూకుడు ప్రదర్శించింది. ఓపెనర్లు అభిషేక్ శర్మ (6), సంజు శాంసన్ (16) వేగంగా ఆడే ప్రయత్నంలో అవుటయ్యారు. ఇషాన్ కిషన్ (10 బంతుల్లో 30) మెరుపు దాడి చేశాడు. ఇషాన్ తన ఇన్నింగ్స్‌లో 3 ఫోర్లు, 2 సిక్సర్లతో అలరించాడు. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (14 బంతుల్లో 22) కూడా ధాటిగా ఆడడంతో స్కోరుబోర్డు పరుగులు పెట్టింది.

భారత ఇన్నింగ్స్‌లో 7.4 ఓవర్ల వద్ద తిలక్ వర్మ (7) ఐదో వికెట్‌గా ఔటైన వెంటనే వర్షం మళ్లీ మొదలైంది. అప్పటికి జట్టు స్కోరు 118 పరుగులు. అంతకుముందు క్రీజులోకి వచ్చిన నమన్ ధీర్ కేవలం 6 బంతుల్లోనే ఒక ఫోర్, మూడు సిక్సర్లతో 24 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. విండీస్ బౌలర్లలో కీమో పాల్, షమార్ స్ప్రింగర్ చెరో రెండు వికెట్లు పడగొట్టారు.వర్షం ఎంతకీ తెరిపివ్వకపోవడంతో, మైదానాన్ని సిద్ధం చేసేందుకు సిబ్బంది ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో అంపైర్లు ఇరుజట్ల కెప్టెన్లతో చర్చించి మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించారు. హోరాహోరీగా సాగుతుందని భావించిన సిరీస్ డిసైడర్ మ్యాచ్ ఇలా ముగియడంతో అభిమానులు తీవ్ర నిరాశకు గురయ్యారు. అనంతరం ఇరు జట్లు ట్రోఫీని పంచుకున్నాయి.

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776